News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :144 | ఖమ్మం | బుధవారం, జూలై 9, 2025 | CK NEWS | పేజీలు : 08


Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## అయ్యా కేటీఆర్ నాతో పెట్టుకుంటే నాశనమవుతావు

- తనను కేటీఆర్ టార్గెట్ చేస్తున్నారన్న సీతక్క
- ములుగు అభివృద్ధి చూసి బీఆర్ఎస్ నేతల అసూయ
- ఓర్వలేకే నాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు
- బీఆర్ఎస్ నేతలది కక్ష సాధింపు రాజకీయమే
- పదేళ్ల పాలనలో ఎన్నో ఆత్మహత్యలకు వారే కారణమని ఆరోపణ



"అయ్యా కేటీఆర్, మీ చెల్లి ఎలాగూ మీ మీద మన్ను పోస్తోంది. నాతో పెట్టుకుంటే మీరు నాశనం అవుతారు. ఇంతకంటే నేను ఏమీ అనలేను. నాతో పెట్టుకుంటే మీరేం బాగుపడరు. నేను శాపనార్థాలు పెట్టగలను, అంతే. మీలాగా కులబలం, ధనబలం, అహంకారం నాకు లేవు. నేను ఒంటరిదాన్ని. నా ఒక్కగానొక్క అన్న కూడా ఉద్యమంలో చనిపోయాడు. నా నియోజకవర్గమే నాకు అండ. నా ములుగు ప్రజల దీవెనలతో నేను మంత్రిని అయ్యాను. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సహకారంతో నేను మంత్రిని అయ్యాను" అని అన్నారు. బీఆర్ఎస్ నేతలు తనపై కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి బీఆర్ఎస్ నేత కేటీఆర్ తనను వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకుని మాట్లాడుతున్నారని ఆమె విమర్శించారు. ములుగు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని, అందుకే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఎంతోమంది ఆత్మహత్యలకు కారణమైన వారు, ఇప్పుడు తనపై కక్ష సాధింపు చర్యలకు దిగడం ఎంతమాత్రం సరికాదని సీతక్క హితవు పలికారు. కేవలం రాజకీయ ఉద్దేశంతోనే తనపై, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు.



### కేసీఆర్‌కు సవాల్ విసిరితే..

# బీఆర్ఎస్ నేతలు అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారు

- మహబూబాబాద్‌లో రూ.295 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- అసెంబ్లీకి రమ్మంటే ప్రెస్ క్లబ్‌కు వెళ్తున్నారు: భట్టి విమర్శ
- ఆ అహంకారం వల్లే లోక్‌సభలో బీఆర్ఎస్‌కు సున్నా
- లక్ష కోట్లతో బీఆర్ఎస్ పాలకుల విఫల యత్నంపై ఫైర్



ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరితే, బీఆర్ఎస్ నేతలు మాత్రం ప్రెస్ క్లబ్‌లకు వెళ్లి అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ నేతల అహంకారపూరిత వైఖరి వల్లే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని, ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులోనూ అదే ఫలితం పునరావృతం కావడం ఖాయమని ఆయన హెచ్చరించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కేసముద్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క తదితరులతో కలిసి భట్టి విక్రమార్క రూ.294.78 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని, మూడు నెలల్లో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. పంటకు రూ.500 బోనస్ ఇవ్వడం అన్యాయం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విమర్శలు గుప్పించారు. "రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కనీసం పది వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేని వారు మాపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉంది" అని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా రాజీపడదని, నీటి వాటాలపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇదే సభల్లో మాట్లాడిన ఇతర మంత్రులు, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీఆర్ఎస్ నేతలు ప్రజలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## ప్రధాని మోడీకి బ్రెజిల్ అత్యున్నత పురస్కారం



న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోడీకి మరో అరుదైన గౌరవం దక్కింది. బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారం 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్' అవార్డుకు ఎంపికయ్యారు ప్రధాని మోడీ. ఈ మేరకు బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా మంగళవారం (జూలై 8) ఈ అవార్డును మోడీకి ప్రదానం చేశారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ వేదికలలో భారతదేశం-బ్రెజిల్ సహకారాన్ని పెంపొందించడానికి మోడీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు.

వివరాలు 2లో..

## ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్

### తొలి 10 మందిలో స్థానం కోల్పోయిన బిల్‌గేట్స్



అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వినూత్న వ్యూహాలతో సంపదను పెంచుకున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 2025లో 3028కి పెరగడం ఇందుకు నిదర్శనం. వీరి మొత్తం సంపద విలువ 16.1 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. 2025 జులైకు

వివరాలు 2లో..



## హైదరాబాద్ పబ్‌లలో భారీగా డ్రగ్స్ దందా

### సేవించేవారికి ప్రత్యేక ప్రాంతాలు

### కొరియర్ ద్వారా నైజీరియన్ల సరఫరా

### టీజీఏఎన్‌బీ ఆపరేషన్‌లో వెలుగులోకి..

### రెస్టారెంట్ నిర్వాహకుడి అరెస్టు

హైదరాబాద్‌లో మరో భారీ డ్రగ్స్ రాకెట్ బహిర్గతమైంది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ)కి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఓ రెస్టారెంట్ నిర్వాహకుడిని పట్టుకొని, విచారించగా దందా వెలుగులోకి వచ్చింది. వినియోగదారుల్లో ఓ గుండె శస్త్రచికిత్స నిపుణుడు ఉండటం గమనార్హం. ఈ ఉదంతంలో 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొంపల్లి మాల్నాడు రెస్టారెంట్ నిర్వాహకుడు సూర్య వద్ద మాదకద్రవ్యాలున్నాయనే సమాచారంతో సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్ బృందం నిఘా ఉంచింది. సోమవారం రాత్రి 7.15 గంటలకు వాహనంలో వచ్చిన సూర్యను పట్టుకుని.. అతని కారు డ్యాష్‌బోర్డును తనిఖీ చేయగా ఓజీ వీడ్, ఎక్స్టసీ మాత్రలు లభించాయి. కారు సీటు కింద దాచిన పార్సిల్ బాక్స్‌లో మహిళల చెప్పులు లభ్యమయ్యాయి. చెప్పు మడమలోని పాకెట్‌లో కొకైన్ దొరికింది.

**పబ్‌లలో మాదకద్రవ్యాలు సేవించా..**

పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో సూర్య పలు అంశాలను వెల్లడించాడు. వాటి ప్రకారం.. బెంగళూరులో ఎంబీఏ చదివిన సూర్య 2020లో హైదరాబాద్‌లో మాల్నాడు రెస్టారెంట్‌ను

వివరాలు 2లో..


## రాజ్యాంగాన్ని మార్చేందుకు భాజపా ప్రయత్నం



రాజ్యాంగాన్ని, చరిత్రను మార్చేందుకు భాజపా ప్రయత్నిస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. పీసీసీ సంవిధాన్ బచావో కమిటీ ఛైర్మన్ డా.వినయ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాజ్యాంగ పరిరక్షణపై సన్నాహక సమావేశం జరిగింది. ఇందులో మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, విశ్రాంత జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొ.హరగోపాల్, సామాజికవేత్త శాంతాసిన్హా, మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... "ప్రజల్లో ద్వేషాన్ని నింపి, మతం పేరిట సెంటిమెంటును రాజేసి పబ్బం గడుపుకోవాలని భాజపా కుట్ర పన్నుతోంది. ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రం అమానవీయ చర్యలకు పాల్పడింది. మావోయిస్టులు చర్చకు సిద్ధమని ప్రకటించినా చలించలేదు" అని విమర్శించారు. ఈ సందర్భంగా విశ్రాంత జస్టిస్

వివరాలు 2లో..

## ప్రశాంతి రెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం



- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు
- ఖండించిన సీఎం చంద్రబాబు
- మహిళలను దూషించడం వైసీపీ రాజకీయ సిద్ధాంతంగా మారిందని విమర్శ
- ఓటమికి కారణం తెలిసినా వైసీపీ నేతల తీరు మారడం లేదని వ్యాఖ్య
- మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడటం నీచ సంస్కృతికి నిదర్శనమన్న సీఎం
- ఇకపై మహిళలను కించపరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

వివరాలు 2లో..

## తెలంగాణ వాటా యూరియాను సకాలంలో పంపండి



న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం (జూలై 8) కేంద్ర మంత్రి నడ్డాను ఆయన నివాసంలో కలిశారు సీఎం రేవంత్. వానా కాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్ – జూన్ మధ్య రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నులకు గానూ కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని

వివరాలు 2లో..

## ఏపీకి మూడు కొత్త బోర్డులు..

### కేంద్ర మంత్రికి అచ్చెన్నాయుడు కీలక వినతులు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ

వివరాలు 2లో..

- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్‌తో అచ్చెన్నాయుడు భేటీ
- గుంటూరు, శ్రీకాకుళం, చిత్తూరులకు వ్యవసాయ బోర్డుల ప్రతిపాదన
- విభజన చట్టం ప్రకారం శ్రీకాకుళంలో అగ్రికల్చర్ యూనివర్సిటీకి విజ్ఞప్తి

## ఇడుపులపాయలో మహానేతకు ఘన నివాళులు

మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం వైయస్ఆర్ జిల్లా ఇడుపులపాయలోని వైయస్ఆర్ ఘాట్ వద్ద వైయస్ఆర్ సతీమణి వైయస్ విజయమ్మ, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు, అభిమానులు, వైయస్ఆర్‌సీపీ నేతలు నివాళులర్పించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



# హైదరాబాద్ పబ్‌లలో భారీగా డ్రగ్స్ దందా

- మొదటి పేజీ తరువాయి

ప్రారంభించాడు. అక్కడికి స్నేహితులు తరచూ వచ్చేవారు. ములుగులో తన బంధువు రాహుల్‌కు చెందిన ఫామ్‌హౌస్‌కు తరచూ వెళ్లేవాడు. హిమాయత్‌నగర్‌కు చెందిన హర్ష, బొల్లారంలో ఉండే నవదీప్‌రెడ్డితో కలిసి అక్కడ మాదకద్రవ్యాలు సేవించేవాడు.
ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజమ్ పబ్, జూబ్లీహిల్స్‌లోని ఫామ్ పబ్, మాదాపూర్‌లోని బర్డ్‌బాక్స్, హైటెక్ సిటీలోని బ్లాక్ 22లో హర్ష, మణికొండకు చెందిన సందీప్ కూరపాటి, విజయవాడకు చెందిన వెంకట్‌లతో కలిసి కొకైన్ సేవించేవాడు.
రాజాశ్రీకర్‌కు చెందిన క్వేక్ అరేనా పబ్, పృథ్వీ వీరమాచినేనికి చెందిన ఎక్సోరా పబ్, రోహిత్ మాడిశెట్టికి చెందిన బ్రాడ్‌వే పబ్‌లోనూ స్నేహితులతో కలిసి మాదకద్రవ్యాలు సేవించేవాడు. ఇందుకోసం పబ్‌లలో ప్రత్యేక ప్రాంతాలను కేటాయిస్తారని వెల్లడించాడు.

పుప్పాలగూడకు చెందిన జశ్వంత్, బెంగళూరులో ఉండే సునీల్, గచ్చిబౌలిలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో కార్డియోవాస్క్యులర్ సర్జన్‌గా పనిచేస్తున్న డా.ప్రసన్న (భీమవరం)లతో కలిసి పలుమార్లు మాదకద్రవ్యాలు సేవించాడు.
2021–22 మధ్య హర్ష నుంచి దాదాపు 20 సార్లు కొకైన్ కొన్నాడు. కరీంనగర్‌కు చెందిన స్నేహితుడు సందీప్ జువ్వాడి నుంచి సైతం కొన్నాడు.
ఖాజాగూడలో ఉండే స్నేహితుడు పల్లెపాక మోహన్ తరచూ బెంగళూరులో ఉండే నైజీరియన్ జెర్రీ నుంచి మాదకద్రవ్యాలను కొని సూర్యకు సరఫరా చేసేవాడు.

**థాయ్‌లాండ్‌లో నైజీరియన్‌తో పరిచయం**

2024 మే నెలలో సూర్య తన స్నేహితులతో కలిసి థాయ్‌లాండ్‌కు వెళ్లినప్పుడు దిల్లీలో ఉండే నైజీరియన్ నిక్ పరిచయమయ్యాడు. అతడి నుంచి తరచూ కొకైన్, ఎక్స్‌టసీ మాత్రలు కొని... రాహుల్, రోహిత్ మాడిశెట్టి, పవన్, శ్రీదీప్‌లకు విక్రయించేవాడు. జూన్‌లో నిక్ నుంచి మాదకద్రవ్యాలు కొని.. వాటిలో కొంత రోహిత్, శ్రీదీప్, రాహుల్, పవన్‌లకు విక్రయించాడు. ఈ నెల 4న కొకైన్ కోసం నిక్ ఖాతాకు రూ.80 వేలు పంపగా.. సోమవారం శ్రీమారుతి కొరియర్ సంస్థ నుంచి సూర్యకు పార్సిల్ అందింది. నైజీరియన్లు డెజ్‌మాండ్, స్టాన్లీ, ప్రిన్స్‌తోపాటు విక్రంరెడ్డి(భీమవరం), తనూజ్(అయ్యప్ప సొసైటీ)లపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రధాని మోడీకి బ్రెజిల్ అత్యున్నత పురస్కారం

- మొదటి పేజీ తరువాయి

'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్' అవార్డు విదేశీ దేశాధినేతలకు మాత్రమే బ్రెజిల్ ప్రదానం చేస్తోంది. అంతర్జాతీయ సంబంధాలను బలోపేతం చేయడంలో ఆదర్శవంతమైన నాయకత్వానికి గుర్తింపుగా బ్రెజిల్ అందించే అత్యంత విశిష్ట అవార్డుల్లో ఇది ఒకటి. 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్' అవార్డు గతంలో అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డి ఐసెన్‌హోవర్, క్వీన్ ఎలిజబెత్ II, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా వంటి అగ్ర ప్రపంచ నాయకులు అందుకున్నారు. తాజాగా ప్రధాని మోడీ ఈ అవార్డు అందుకుని వారి సరసన చేరారు. 2014 మేలో భారత ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మోడీ
అందుకున్న 26వ అంతర్జాతీయ అవార్డు ఇది. ఇటీవల ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాలు కూడా ప్రధాని మోడీ ఆ దేశా అత్యున్నత పౌర పురస్కారాలను ప్రదానం చేసిన విషయం తెలిసిందే.

# ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్

- మొదటి పేజీ తరువాయి

సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఎలాన్‌మస్క్ ప్రపంచ అగ్రగామి కుబేరుడిగా కొనసాగుతున్నారు. అయితే ఈ ఏడాది జూన్‌తో పోలిస్తే ఆయన సంపద విలువ 16 బి. డాలర్లు తగ్గి 407 బి. డాలర్ల (రూ.34.6 లక్షల కోట్ల)కు పరిమితమైంది. 2024 మేలో 400 బి. డాలర్ల మైలురాయిని అధిగమించిన తొలి కుబేరుడిగా నిలిచినప్పటి నుంచీ, మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఒరాకిల్ సహ వ్యవస్థాపకులు లారీ ఎలిసన్ నాలుగో స్థానం నుంచి రెండో స్థానానికి ఎదిగారు. జూన్‌తో పోలిస్తే ఒరాకిల్ షేరు 32% రాణించడంతో, 56 బి. డాలర్లను జత చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీ ఎన్‌విడియాకు సీఈఓ, సహవ్యవస్థాపకుడిగా ఉన్న జెన్సెన్ హువాంగ్ సంపద విలువ 20 బి. డాలర్లు పెరగడంతో, 11వ స్థానం నుంచి 10వ స్థానానికి చేరారు. అగ్రగామి 10 మంది కుబేరుల సంపద విలువ జూన్ 1తో పోలిస్తే 100 బిలియన్ డాలర్లు అధికమై 2 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. వీరిలో బెర్నార్డ్ ఆర్నాల్ట్ (ఫ్రాన్స్) మినహా, ఇతరులంతా అమెరికన్లే.

తన సంపద విలువ 7 రోజుల్లోనే దాదాపు 30% (52 బిలియన్ డాలర్లు) తగ్గి, 124 బిలియన్ డాలర్లకు పరిమితం కావడం వల్ల, అగ్రగామి 10 మంది కుబేరుల జాబితాలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్‌గేట్స్‌కు స్థానం దక్కలేదు. తన సంపదలో అత్యధిక భాగాన్ని గేట్స్ ఫౌండేషన్ ద్వారా రాబోయే రెండు దశాబ్దాల్లో దాతృత్వ కార్యక్రమాలకే వెచ్చిస్తానని బిల్‌గేట్స్ తెలిపారు.

**15వ స్థానంలో ముకేశ్**

దాదాపు 116 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 15వ స్థానంలో ముకేశ్ అంబానీ ఉన్నారు. 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.85 లక్షల కోట్ల) క్లబ్‌లో ఉన్న ఏకైక ఆసియావాసి ఈయనే.

## ప్రశాంతి రెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం

మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని ఉద్దేశించి వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు తీవ్రస్థాయిలో స్పందించారు.
"కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం. ప్రశాంతి రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. వైసీపీ నేతల తీరులో మార్పు రావడం లేదు. మహిళలను దూషించడం, బూతులు తిట్టడం, కించపరచడం అనేది ఆ పార్టీ రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకుంది. మహిళలను అవమానపరచడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉంది. వారి ఘోర ఓటమికి ఇలాంటి పోకడలు ఒక కారణమని తెలిసినా వారి సహజ గుణంలో మార్పు రావడం లేదు. చెల్లి పుట్టుకపైనా వ్యాఖ్యలు చేసిన వారి నాయకత్వంలో పనిచేస్తోన్న నేతలు అంతే దారుణంగా, అసహ్యంగా మాట్లాడుతూ వారి నీచ సంస్కృతిని చాటుకుంటున్నారు.
మహిళలపై వ్యక్తిగత విమర్శలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వీరు మనుషులేనా? ఇది రాజకీయమా? మహిళల, మహిళానాయకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, ప్రణాళికాబద్ధంగా వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రతి పౌరుడు గమనించాలి. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠినచర్యలు ఉంటాయి" అంటూ చంద్రబాబు స్పష్టం చేశారు.

# ప్రైవేట్ వీడియోతో బ్లాక్‌మెయిల్... రూ.3 కోట్లు పోగొట్టుకుని సీఏ ఆత్మహత్య!

- ప్రైవేట్ వీడియోతో బ్లాక్‌మెయిల్.. ముంబైలో సీఏ ఆత్మహత్య
- 18 నెలలుగా రూ.3 కోట్లకు పైగా వసూలు చేసిన నిందితులు
- విలాసవంతమైన కారును సైతం లాక్కున్న కేటుగాళ్లు
- నా చావుకు ఇద్దరే కారణమంటూ సూసైడ్ నోట్
- రాహుల్ పర్వానీ, సబా ఖురేషీలపై కేసు నమోదు చేసిన పోలీసులు



ఓ ప్రైవేట్ వీడియోను అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఇద్దరి వేధింపులు తాళలేక ఓ చార్టెర్డ్ అకౌంటెంట్ (సీఏ) ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ముంబైలో చోటుచేసుకుంది. మృతుడు రాజ్ లీలా మోరే (32) తన చావుకు కారణమైన ఇద్దరి పేర్లను సూసైడ్ నోట్‌లో వెల్లడించారు. వివరాల్లోకి వెళితే, రాజ్ మోరే ఓ మంచి కంపెనీలో సీఏగా పనిచేస్తూ స్టాక్ మార్కెట్‌లో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ విషయం తెలిసిన రాహుల్ పర్వానీ, సబా ఖురేషీ అనే ఇద్దరు వ్యక్తులు.. రాజ్ మోరేకు సంబంధించిన ఓ ప్రైవేట్ వీడియోను సంపాదించారు. దాన్ని బయటపెడతామని బెదిరిస్తూ గత 18 నెలలుగా ఆయన నుంచి రూ.3 కోట్లకు పైగా డబ్బు గుంజారు. అంతటితో ఆగకుండా, ఆయన విలాసవంతమైన కారును సైతం బలవంతంగా లాక్కున్నారని అధికారులు తెలిపారు.
ఈ వేధింపులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన రాజ్ మోరే, మంగళవారం విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా స్థలంలో పోలీసులకు మూడు పేజీల సూసైడ్ నోట్ లభించింది. "నా ఆత్మహత్యకు రాహుల్ పర్వానీ, సబా ఖురేషీలే కారణం. నన్ను బ్లాక్‌మెయిల్ చేసి, నా సేవింగ్స్ అన్నింటినీ దోచుకున్నారు. కంపెనీ అకౌంట్ నుంచి కూడా డబ్బు దొంగిలించేలా చేశారు" అని ఆయన ఆ నోట్‌లో ఆరోపించారు. మరో పేజీలో తన తల్లికి క్షమాపణలు చెప్పగా, ఇంకో పేజీలో తన సహోద్యోగులను ఉద్దేశించి రాశారు. "దీపా లఖానీ, మీ నమ్మకాన్ని వమ్ము చేసినందుకు క్షమించండి. నేను చేసిన మోసానికి నేనే బాధ్యుడిని. శ్వేత, జైప్రకాశ్ లకు ఏమీ తెలియదు, దయచేసి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు" అని అందులో పేర్కొన్నారు.
గత కొద్ది నెలలుగా తన కుమారుడు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడని మృతుడి తల్లి పోలీసులకు తెలిపారు. రాజ్ మోరే సూసైడ్ నోట్ ఆధారంగా రాహుల్ పర్వానీ, సబా ఖురేషీలపై పోలీసులు బలవంతపు వసూళ్లు, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## రాజ్యాంగాన్ని మార్చేందుకు భాజపా ప్రయత్నం

- మొదటి పేజీ తరువాయి

సుదర్శన్‌రెడ్డి... సోషలిజం, సెక్యులరిజంపై ప్రసంగించడంతోపాటు రాజ్యాంగ రూపకల్పన, దాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ... "ఇటీవల గోవాలో జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో మూడు రకాల తీర్మానాలు చేశారు. తొలిరోజు డెమోక్రసీ వద్దన్నారు. రెండోరోజు రాజ్యాంగం వద్దన్నారు. మూడోరోజు భారత దేశ పరిస్థితులు, సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా నూతన రాజ్యాంగం రాయాలి" అని తీర్మానాలు చేశారన్నారు.

# తెలంగాణ వాటా యూరియాను సకాలంలో పంపండి

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా నడ్డా దృష్టికి తెచ్చారు సీఎం రేవంత్.
రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం, వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న సమయంలో యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. జులై నెలకు సంబంధించి దేశీయంగా ఉత్పత్తయిన యూరియా 63 వేల మెట్రిక్ టన్నులు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా 97 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే చేశారని వివరిస్తూ వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే, తెలంగాణకు దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను పెంచాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్లు కేటాయించడం లేదని, వాటి సంఖ్య కూడా పెంచాలని కోరారు.

## ఏపీకి మూడు కొత్త బోర్డులు..

మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ఆయన మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు మూడు ప్రధాన వ్యవసాయ బోర్డులను ఏర్పాటు చేయాలని అచ్చెన్నాయుడు కోరారు. గుంటూరులో మిర్చి బోర్డు, శ్రీకాకుళంలో జీడిపప్పు బోర్డు, చిత్తూరులో మామిడి బోర్డును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వీటితో పాటు, విభజన చట్టంలోని హామీ మేరకు శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా, తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర నష్టాలను అచ్చెన్నాయుడు కేంద్రమంత్రికి వివరించారు. మార్కెట్‌లో ధర కిలోకు రూ. 8కి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, ధరల లోటు చెల్లింపు పథకం కింద మద్దతు ధరగా రూ. 12 నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇందుకోసం 6.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 260 కోట్లు ఖర్చు చేస్తోందని, ఈ భారాన్ని తగ్గించేందుకు కేంద్రం కూడా భాగస్వామ్యం కావాలని అభ్యర్థించారు. అలాగే, వెనుకబడిన జిల్లాలకు మైక్రో ఇరిగేషన్ పథకం కింద రాయితీని పెంచాలని, ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ తరహాలో ఆంధ్రప్రదేశ్‌కు కూడా ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేయాలని కోరారు. అచ్చెన్నాయుడు చేసిన వినతులపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# నెల్లూరులో నేలబారు రాజకీయాలు.. ఎప్పుడూ లేనిది ఇప్పుడే ఎందుకు?




సింహపురి రాజకీయాలు వేడెక్కాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నెల్లూరు పాలిటిక్స్ మాత్రం ఇప్పుడు దాడులతో హీటెక్కాయి. నెల్లూరు జిల్లా అంటే ప్రశాంతతకు మారు పేరు. గత కొన్ని దశాబ్దాలుగా అనేక మంది నెల్లూరు నుంచి రాజకీయాల్లో ఎదిగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మాత్రం అందుకు విరుద్ధంగా దాడులు జరుగుతున్నాయి. నేతల మధ్య వ్యక్తిగత ఆరోపణలు చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. నెల్లూరు జిల్లాలో రెడ్డి సామాజికవర్గానిదే ఆధిపత్యం. గతంలో ఈ జిల్లా నుంచి ఆనం గోపాల్ రెడ్డి నుంచి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి వరకూ ఎంతో హుందాగా రాజకీయాలు నడిచేవి. వ్యక్తిగత విమర్శలకు అసలు చోటుండేవికావు. కేవలం రాజకీయ విమర్శలు మాత్రమే ఉండేవి.

**హుందా రాజకీయాలుమాని...**

కానీ రాను రాను రాష్ట్ర వ్యాప్తంగా మారుతున్న రాజకీయ పరిణామాలు సింహపురి రాజకీయాలను కూడా మార్చేస్తున్నాయి. హుందాగా రాజకీయాలు చేసిన నేతలు ఇప్పుడు చౌకబారు విమర్శలకు దిగుతున్నారు. అంతేకాదు.. రాజకీయ విమర్శలను పక్కన పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ఫలితంగా దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నాయి. డబ్బు పుష్కలంగా ఉంది. అధికారం కూడా నెల్లూరు రెడ్లకు ఉంది. అయితే అన్నింటికీ మించి నెల్లూరు రెడ్లు రాజకీయాల్లో సంస్కారవంతంగా వ్యవహరిస్తారన్న పేరుంది. అలాంటి నెల్లూరు రాజకీయాలు నేడు నేలబారుకు చేరుకున్నాయి. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిల మధ్య వివాదం చోటు చేసుకుంది.

**మాటలకు కట్టుబడి ఉన్నా...**

మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై అవినీతి ఆరోపణలను వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేశారు. దానికి కౌంటర్ ఇవ్వడంలో భాగంగా నల్లపురెడ్డి ప్రసన్నకుమార రెడ్డి కొంత ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత దుర్భాషలకు దిగారు. దీంతో ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై దాడులు జరిగాయి. ఇంట్లో ఫర్నీచర్ ను ధ్వంసం చేశారు. వాహనాలను ధ్వంసం చేశారు. అయితే ఈ దాడులు వేమిరెడ్డి కుటుంబం మాత్రమే చేసిందని నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆరోపిస్తున్నారు. డబ్బు ఉందన్న అహంకారంతో దాడులకు పాల్పడుతున్నారని, తాను ఎక్కడా తప్పు మాట్లాడలేదని, తాను ఆమెపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తెలిపారు.

**తమకు సంబంధం లేదు...**

అయితే నల్లపురెడ్డి ఇంటిపై దాడితో తమకు సంబంధం లేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. దాడుల సంస్కృతి తమది కాదన్న ఆమె ప్రసన్నకుమార్ వల్ల చాలా మంది బాధపడ్డారన్నారు. వారిలో ఎవరో ఒకరు దాడి చేసి ఉండొచ్చని ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఆరోపణలు చేసిన వైసీపీ నేతలకు నాది ఒకటే ప్రశ్న అని, నల్లపురెడ్డి తనపై వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలను వైసీపీ నేతలు మీ ఇంట్లో మహిళలకు చూపించాలని సవాల్ విసిరారు. నల్లపురెడ్డివ్యాఖ్యలను జగన్ సీరియస్‌గా తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మొత్తం మీద సింహపురి రాజకీయాలు దాడుల సంస్కృతికి దిగడం ఆందోళనకు గురి చేస్తున్నాయి.

# భద్రత లేని భరోసా.....!

- మునిగాక పరామర్శలు వద్దు ముందే రక్షణ చర్యలు చేపట్టాలి.
- సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు.
- కూలిన రక్షణ గోడను పరిశీలించిన సిపిఐఎం బృందం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి,( సాయి కౌశిక్),జూలై 08,** ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ భద్రాద్రి భద్రతకు భరోసా లేకుండా పోతుందని మునిగాక రాజకీయాల కోసం పరామర్శలు చేయటం మాని ముందే రక్షణ చర్యలు చేపట్టాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కరకట్ట రక్షణ గోడ కూలిన ప్రదేశాన్ని సీ పి ఎం ఆధ్వర్యం లో మచ్చ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మచ్చ మాట్లాడుతూ కరకట్ట పైన 50 మీటర్ల మేర రక్షణ గోడ కూలిపోయినప్పటికీ జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరావు భద్రాచలం పర్యటించి కూడా ఆ ప్రదేశాన్ని పరిశీలించకపోవడం లోతట్టు ప్రాంత ప్రజల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరి స్పష్టం చేస్తుందని అన్నారు. గతంలో రక్షణ గోడ ఉన్నప్పటికీ కొత్త కాలనీ ఏఎంసి కాలనీ అయ్యప్ప కాలనీ తదితర ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయని ఇప్పుడు ఆ గోడ సైతం పడిపోవడంతో ఆ ప్రాంత ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే కరకట్ట స్లుయిసులు కరకట్ట భద్రతపై అధ్యయనం చేయాల ని సిపిఐఎం పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేసి అధికారుల దృష్టికి మంత్రుల దృష్టికి తీసుకువెళ్లిన ఇటు ప్రజాప్రతినిధులు గాని అధికారులు గానీ నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరించిన ఫలితంగానే ఈరోజు పెను ప్రమాదం ముంచుకొస్తుందని మచ్చ స్పష్టం చేశారు. గోడ కూలి అంశాన్ని ఇరిగేషన్ అధికారుల వద్ద ప్రస్తావిస్తే ఆంధ్ర భూభాగంలో పడిపోయిన గోడకి తెలంగాణ నిధులతో మరమ్మతులు చేయడం సాధ్యపడదని తీర్చి చెప్తున్నారు అని గోడ ఆంధ్ర ప్రాంతాల్లో ఉన్న ముప్పు తెలంగాణకే వస్తుందన్న విషయం అధికారులు గుర్తించాలని ఆయన హితవు పలికారు. వెంటనే జిల్లా మంత్రులు ఉన్నత అధికారులు వెంటనే కరకట్టను పరిశీలించి రక్షణ గోడ నిర్మించడంతోపాటు కట్టపై వచ్చిన పగుళ్ల వద్ద మరమ్మతులు చేపట్టాలని అదేవిధంగా కొత్త కాలనీ అయ్యప్ప కాలనీ స్లూ ఈజ్ లను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. గతం కంటే ఈ సంవత్సరం అధిక వర్షపాతం నమోదయ్య అవకాశం ఉందని వాతావరణ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ముంపు కూడా అదే స్థాయిలో ఉంటుందని ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టి లోతట్టు ప్రాంత ప్రజలను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి కొలగాని బ్రహ్మాచారి పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు పారేల్లి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు కుంజా శ్రీనివాస్ అజయ్ కుమార్ డివైఎఫ్ఐ నాయకులు సతీష్ బాబు శాఖ కార్యదర్శి గోవర్ధన్ ఝాన్సీ ఎర్రంశెట్టి పూర్ణిమ స్థానికులు లంబ రమణ సాయి దేవి ఉమారెడ్డి కళావతి తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం.

- మాజీ మండల మహిళా అధ్యక్షురాలు బోడ లోకేశ్వరి,వీరన్న దంపతులు.





**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, జూలై 08:**ఎటపాక మండల పరిధిలోని పిచ్చుకలపాడు గ్రామ పంచాయతీ లోని చదలవాడ గ్రామనికి చెందిన వైస్సార్సీపీ మాజీ మండల మహిళా అధ్యక్షురాలు బోడ లోకేశ్వరి, వీరన్న దంపతులు మిరియాల శిరీషా దేవి సమక్షంలో టీడీపీ లో చేరడం జరిగింది.

లోకేశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం సంవత్సరం నుండి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి కొనిడారు. అభివృద్ధి అంటేనే చంద్రబాబు అని అందకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని వర్గాల ప్రజల ఆరాధ్యుడు వై.ఎస్.

- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గా అన్ని వర్గాల ప్రజల ఆరాధ్యుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. దివంగత ముఖ్య మంత్రి పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి సందర్భంగా పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాల్వంచ బి సి ఎం రోడ్డు లోని బస్టాండుకు ఎదురున గల వైయస్ విగ్రహానికి కొత్వాలతో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వైయస్ జన్మదిన కేకును నాయకులు కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ వైయస్ ముఖ్య మంత్రిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. రైతులకు ఒకే దఫా రెండు లక్షల రుణ మాఫీ, పేద ప్రజల వైద్యానికి రెండు లక్షల ఆరోగ్యశ్రీ పథకం, 104,108 సేవలు పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఫీజు రియంబర్స్మెంట్, వంటి పథకాలు చేపట్టి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొత్వాల అన్నారు. కాంగ్రెస్ ముఖ్య మంత్రిగా వైయస్ అడుగుజాడల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజాసేవ చేయాలని కొత్వాల అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బరిపటి వాసుదేవరావు, మాజీ జడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, పెద్దమ్మ గుడి చైర్మన్ బాలినేని నాగేశ్వర రావు, ఆర్టిఐ మెంబర్ బాదర్ల జోషి కుమార్, ఎల్ డి ఎం కోఆర్డినేటర్ బద్ది కిషోర్, లేబర్ సెల్ చైర్మన్ సాధం రామకృష్ణ రావు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ఏ జలీల్, మహిపతి రామలింగం, కాల్వ భాస్కరరావు, కందుకూరి రాము, కాపర్తి వెంకటాచారి, గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, బాబు నాయక్, అద్వకేట్ తుమ్మల శివారెడ్డి, చింతా నాగరాజు, మస్నా శ్రీనివాస్, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, షేక్ చాంద్ పాషా, డిష్ నాగేశ్వరరావు, వాసు మల్ల సుందర్రావు, దారా చిరంజీవి, మాలోత్ కోటి నాయక్, ధర్మసోత్ ఉపేందర్, ఓలపల్లి రాంబాబు, నరేందర్ రెడ్డి, గంధం నరసింహారావు, ఎస్ కే భాష, కటుకూరి శేఖర్, కొత్తపల్లి రవి, వాసు మల్ల సోమయ్య, వాసుమల్ల రవి, చెరుకుమిల్లి సూర్య కిరణ్, ఘడదేశి ప్రభాకర్, బండి నాగరాజు, బానోతు బాలాజీ, జనార్దన్ రెడ్డి, సదాశివ, భోగిని సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల సంరక్షణ మన అందరి భాధ్యత.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.
- జిల్లా బాలల సంరక్షణ యూనిట్ డి సి పి యు సమావేశం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,** జిల్లా బాలల సంరక్షణ యూనిట్ డి సి పి యు సమావేశాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా ఉండాలని, మారుమూల ప్రాంతాల ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కోళ్ల ఫామ్స్,ఇటుక బట్టీలు షాపింగ్ మాల్ లో తదితర అన్నిచోట్ల తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మణుగూరులో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ గృహం జిల్లా కేంద్రం కి దూరంగా ఉండటం వలన పర్యవేక్షించడానికి అనువుగా లేదని జిల్లా కేంద్రంలో కొత్తగూడెంలో బాలల సంరక్షణ గృహం ఏర్పాటుకు ప్రణాళికల రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మణుగూరు లో ఉన్న బాలల సంరక్షణ గృహమును సిడిపిఓ కార్యాలయంగా మార్చాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని బాలల సంరక్షణ గృహంలో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, సంరక్షణ గృహాలలో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలపై వారంలోగా సమగ్ర నివేదిక అందించాలని వెంటనే సమస్యలు పరిష్కరిస్తాము అన్నారు.సంరక్షణ గృహాలలో పిల్లల ఆరోగ్య పై శ్రద్ధ చూపించాలని, ఏదైనా పెద్ద ఆరోగ్య సమస్యలు పిల్లలకు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పిల్లలకు నెలకి ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థినిల హాజరు పర్యవేక్షించాలని ఎవరైతే పది రోజుల కంటే ఎక్కువ సెలవులు ఉన్నాయో అట్టి విద్యార్థినిలను ఆరోగ్య సమస్య లేదా వివాహం ఏమైనా జరిగిందా అని విచారణ చేపట్టాలని అధికారులు ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పిల్లల సంరక్షణ చేపట్టాలని, పిల్లల సంరక్షణ మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు.జిల్లాలో ఎన్ని పోక్సో కేసులు నమోదయ్యాయి, జిల్లా స్థాయి, మండల, గ్రామ స్థాయిలలో నమోదు అయిన కేసుల పూర్తి వివరాలను వారం రోజులలోగా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నివేదికల ద్వారా ఏ ప్రాంతంలో అయితే ఎక్కువ పోక్సో కేసు నమోదు అయ్యాయో ఆ ప్రాంతంలో అవగాహన సదస్సులు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి చర్యలు చేపడతామని కలెక్టర్ అన్నారు.చైల్డ్ హెల్ప్ లైన్ కు వచ్చే ఫిర్యాదుల ను జిల్లా, మండల గ్రామ స్థాయిలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు ప్రతి నెల మొదటి వారంలో జిల్లాలోని అన్ని పాఠశాలలు, హాస్టల్స్ ల హెడ్మాస్టర్లు వార్డెన్ లకు ఫోన్ చేసి పాఠశాలలో ఎవరైనా లైంగిక వేధింపులకు గురి అయ్యారా, ఉపాధ్యాయులు పిల్లలను కొట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారా అని అడిగి, విద్యార్థుల పూర్తి బాధ్యత హెడ్మాస్టర్ లది హాస్టల్ వార్డెన్ లదే అని స్పష్టం చేయాలన్నారు. ఎవరైనా అటువంటి చర్యలకు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పోస్టర్ను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి జయలక్ష్మి , సిపిఓ సంజీవరావు, మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లెనీనా,బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిరా ఐటీ కోర్ సిఐ రాము సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## వైఎస్.రాజశేఖర్ రెడ్డి" జయంతి సందర్భంగా నివాళు లర్పించిన ఎమ్మెల్యే తెల్లం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,**భద్రాచలం పాత మార్కెట్ సెంటర్ నందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత మహానేత "డా!!వైఎస్.రాజశేఖర్ రెడ్డి" జయంతి సందర్భంగా పాత మార్కెట్ సెంటర్ నందు ఆయన విగ్రహానికి పూలమాల వేసి మహనీయుడికి ఘన నివాళులు అర్పించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.

డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ భోగాల శ్రీనివాస్ రెడ్డి మరియు మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కరకట్ట పనులు, గోదావరి డ్రైనేజ్ వాటర్ స్లూయిజ్ల ను పరిశీలించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,**భద్రాచలంలో రామాలయం టెంపుల్ పరిసరి ప్రాంతం లో వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు భాగంగా డ్రైనేజ్ వాటర్ స్లూయిజ్లను, కరకట్ట పనులను పరిశీలించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటిడిఏ పిఓ బి.రాహుల్ , ఆర్డీవో ,ఎమ్మార్వో మరియు మండల అధికారులు బృందం. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి వరద నీరు ఊర్లోకి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మోటార్లను తెప్పించి అమర్చారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పై అధికారులకి సమాచారం తెలియజేయాలని తెలిపారు.కరకట్ట పనులను నాణ్యత పాటించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## బ్రతుకు చివరి అంచున చదువు నేర్పించిన టీచర్..

- గుండె ఆపరేషన్ కి భరోసా కల్పించిన జర్నలిస్ట్ కిరణ్ కుమార్.
- ఆమె ఆరు పదులు దాటిన వృద్ధురాలు..
- తనకంటూ ఎవరూ లేని స్థితి.
- గుండె సంబంధిత సమస్యతో బతికీడుస్తున్న దైన్య స్థితి..
- వృద్ధాప్య దశలో ఉన్నవారిని ఐన వారే కాదనుకునే నేటి ఆధునిక కర్కశ సమాజం..
- చిన్నప్పుడు ఓనమాలు దిద్దించిన గురువుపట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నాడు జర్నలిస్టు కిరణ్ కుమార్ గండికోట..

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / చుంచుపల్లి ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,**చుంచుపల్లి మండలం రాంనగర్ నివాసి మొతడాకా రమాదేవి (65) ఓ ప్రైవేటు పాఠశాల టీచర్ గా పనిచేశారు.తన భర్తను కోల్పోయారు..పిల్లలు కూడా లేరు తనకంటూ ఎవరూ లేని పరిస్థితుల్లో వృద్ధాప్య దశలో ఓ వైపు ఒంటరితనం వేధిస్తూ ఉంటే మరోవైపు గుండె సంబంధిత సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు.తల్లి తండ్రి తర్వాత స్థానంలో తనకు ఓనమాలు దిద్దించిన గురువు రమాదేవి ఆరోగ్య విషమ పరిస్థితి గురించి తెలుసుకుని చలించి పోయిన జర్నలిస్ట్ కిరణ్ కుమార్.. ఆమెను పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పాడు. స్థానిక హృదయ క్లినిక్ గుండె స్పెషలిస్ట్ డాక్టర్ వద్దకు ఆమెను తీసుకువెళ్ళి, డాక్టర్ కు పరిస్థితిని వివరించారు. డాక్టర్ అరుణ్ కుమార్ క్షుణ్ణంగా పరిశీలించి గుండెకు సంబంధించిన అన్ని టెస్టులు చేశారు.ఆమె ఆరోగ్య పరిస్థితి బాగాలేదని, వెంటనే గుండెకు సంబంధించిన ఆపరేషన్ చేయవలసి ఉంటుందని తెలిపారు. డాక్టర్ రాసిచ్చిన మందులను నెల రోజులకు సరిపడా కిరణ్ అందజేశాడు. తనవంతు ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వ సహకారంతో ఆపరేషన్ చేయిస్తానని తన టీచర్ కు భరోసా ఇచ్చారు.చిన్నతనంలో ఓనమాలు దిద్దించిన గురువు పట్ల కిరణ్ కుమార్ చూపిస్తున్న గౌరవం ,ప్రేమ ఆదరాభిమానాలను చూసి డాక్టర్ అరుణ్ కుమార్ సైతం చలించి పోయారు. ఆమె గుండె శస్త్ర చికిత్స కు సంబంధించి ప్రముఖ కార్డియాలజిస్టులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.ఒక జర్నలిస్టుగా ఆర్థికంగా ఉన్నత స్థితిలో లేకపోయినా కిరణ్ కుమార్ ఆపదలో ఉన్నవారికి తనవంతు సాయం చేయడాన్ని తన ప్రవృత్తిగా చేసుకున్నాడు..చిన్నతనంలో ఎప్పుడో తనకు ఓనమాలు నేర్పిన ఉపాధ్యాయురాలు పట్ల కిరణ్ కుమార్ గండికోట చూపిన ఔదార్యం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఇలా ఎందరో అనాథలను అభాగ్యాలను చేరదీస్తూ వారికి తోచిన సహాయాన్ని అందిస్తున్నా జర్నలిస్ట్ కిరణ్ కుమార్ గండికోటకు పలువురి అభినందనలు.



# రేపటి నుండి ప్రారంభమయ్యే మెగా ఆధార్ క్యాంపును సద్వినియోగం పరుచుకోవాలి..

- మెగా ఆధార్ క్యాంప్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి.
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ )జూలై 08,**ఆధార్ కార్డులో అవసరమైన వివరాల సవరణలు చేసుకునేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న మెగా ఆధార్ క్యాంపును సద్వినియోగపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు . జూలై 9 మరియు 10 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం లో ఈ క్యాంపులు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆధార్ క్యాంపులకు విచ్చేసే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సందేహాలు మరియు ఆధార్ కార్డుల సవరణకు తగిన సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. కావున ప్రజలు ఆధార్ కార్డులో తప్పులున్న వారు, కొత్త సమాచారం జత చేయాలనుకునే వారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ ఆధార్ క్యాంపులో పలు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు . వాటిలో పేరు మార్పు లేదా సవరణ, పుట్టిన తేది సవరణ, లింగం మార్పు, చిరునామా సవరణ, మొబైల్ నంబర్ అప్డేట్, ఫోటో అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్, తల్లిదండ్రుల పేర్లను జోడించడం వంటి సేవలు ఉన్నాయి అని తెలిపారు . ప్రత్యేకంగా 5 మరియు 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ వివరాలు తప్పనిసరిగా నవీకరించాల్సి ఉంటుందన్నారు. అలాగే 0–5 ఏళ్ల పిల్లల ఆధార్‌లో తల్లిదండ్రుల పేర్లను జతచేసే అవకాశం కూడా ఈ క్యాంపులో కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కొన్ని వివరాలు ఆన్‌లైన్ ద్వారా అప్డేట్ చేయవచ్చు, మరికొన్ని మాత్రం ఆధార్ సేవా కేంద్రం నుంచే చేయాల్సి ఉంటుందని, ఉదాహరణకు, చిరునామా మార్పు ఆన్‌లైన్‌లో సాధ్యపడుతుంది కానీ మొబైల్ నంబర్ లేదా పుట్టిన తేది సవరణ వంటి సేవలు కేవలం ఆధార్ సేవా కేంద్రాల్లోనే చేయాలి. కొన్ని సవరణలకు జీవితంలో ఒక్కసారే అవకాశం ఉంటుందని అయన స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయి బృందం ఈ కేంద్రంలో అందుబాటులో ఉన్నందున దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఆధార్ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ తెలిపారు.

కావున ఆధార్ డేటాలో ఏవైనా సవరణలు చేయించుకోవాలనుకుంటున్న జిల్లావాసులు తప్పక ఈ మేగా ఆధార్ క్యాంపులను సందర్శించాలని, నవీకరణకు లేదా సవరణకు అవసరమైన పత్రాలను తీసుకువచ్చి తమ వివరాలను నవీకరణ చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- బూర్గంపాడు తహసిల్దార్ ప్రసాద్.
- మండల అధికారులతో సమావేశం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జూలై 08,**బూర్గంపహాడ్ మండల పరిధిలో 2025 గోదావరి విపత్తుల ప్రాంతంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల తహసిల్దార్ కార్యాలయం లో అధికారులకు వరదలకు సంబంధిత విషయంపై మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటూ వరదప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు, వరదల పట్ల పలు అంశాల పై చర్చించారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జమలారెడ్డి, ఎస్ఐ2 నాగబిక్షం, ఎంపీఓ బాలయ్య, డాక్టర్ సాహితీ ఎంపి బంజర్, ఏంఈఓ సింహ రాజు, వెటర్నరీ డాక్టర్ రాజేందర్, విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్, సబ్ ఇంజనీర్ రామకృష్ణ రెడ్డి తో పాటు డిప్యూటీ తహసీల్దార్ రషీద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరసింహరావు వారి సిబ్బంది తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం




**పలమనేరు జూలై 9 సీకే న్యూస్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, పలమనేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.

జూనియర్ కాలేజీ నుండి, గుడియాత్తం రోడ్డు వరకు, భరతమాత చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించి, భరతమాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ముఖ్య అధ్యక్షునిగా, విద్యార్థి సంఘ పూర్వ నాయకుడు మరియు ఇప్పటి పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్ అధ్యక్షత వహించి, ప్రసంగించారు.ఆయన మాట్లాడుతూ....దేశానికి 1947 లో స్వాతంత్రం వచ్చిందని, 1949 లోనే పూర్తిస్థాయిలో ఏబీవీపీ స్థాపించడం జరిగిందని, ఇదే కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం చేసి, తిరిగి కళాశాలకే ముఖ్యఅతిథిగా రావడం ఆనందంగా ఉందని, విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి ఏబీవీపీ ఉందని, దేశవ్యాప్తంగానే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఉన్నాయని, ఈ సందర్భంగా ఎల్ భాస్కర్ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పళని, మాజీ విద్యార్థి సంఘం నాయకులు శరవణ, ఉమామహేశ్వర్, జగన్నాథం, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి కనబడుటలేదు



**జులై 08 (సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండల మండల కేంద్రానికి చెందిన విద్యార్థి వివరాలోనికి వెళ్తే 04. 07. 2025 నాడు రాత్రి అందరు నిద్రిస్తున్న సమయంలో షేక్ ఆసిఫ్, వయస్సు 16 సంవత్సరాలు, తండ్రి షేక్ షాదుల్, కులము ముస్లిం, విద్యార్థి, నివాసం చేగుంట, తన తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ ఇప్పించడం లేదని అలిగి ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి ఎటో వెళ్లిపోయినాడు వారి తల్లిదండ్రులు చుట్టుప్రక్కల వేతకిన మరియు బంధువుల వద్ద వెతికిన ఎలాంటి ఆచూకీ తెలియలేదు అతను ఇంట్లో నుండి వెళ్లినప్పుడు తెలుపు గోధుమ రంగు షర్టు, నీలం రంగు పాయింటు ధరించినాడు అతను కొల ముఖం కలిగి నలుపు రంగు కలడు, ఎత్తు సుమారు నాలుగు ఫీట్లు కలడు ఇట్టి విషయంలో షేక్ సాధుల్ తండ్రి షేక్ మౌలానా, వయసు 44 సంవత్సరములు, వృత్తి కూలి పని, నివాసం చేగుంట వారి ఫిర్యాదు మేరకు చేగుంట సబ్ ఇన్స్పెక్టర్ జి చైతన్య కుమార్ రెడ్డి, ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించడమైనది,

# కొన్ని కార్మిక సంఘాలు జూలై9వ తేదీన తలపెట్టిన ఒకరోజు సమ్మెకు దూరంగా ఉండండి.

- విధులకు హాజరు కండి.
- లక్ష్య సాధనలో సహకరించండి.
- డైరక్టర్ (పి,పి) కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,**కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో జూలై9వ తేదీన దేశ వ్యాప్తముగా తలపెట్టిన ఒకరోజు సార్వత్రిక సమ్మెకు సింగరేణి ఉద్యోగులు దూరంగా ఉండాలని, బొగ్గు ఉత్పత్తి మరియు రవాణా కొరకు ఎటువంటి ఆటంకం కలుగ కుండా చర్యలను తీసుకోవాలని డైరక్టర్ (పి,పి) కే.వెంకటేశ్వర్లు మరియు డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు, మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నీ ఏరియాల జనరల్ మేనేజర్లతో సమీక్షను నిర్వహించారు.

ఈ సంధర్భముగా డైరక్టర్(పి,పి) కే.వెంకటేశ్వర్లు మరియు డైరక్టర్ (పా) గౌతమ్ పొట్రు, సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో జూలై 9వ తేదీన ఒకరోజు సమ్మెకు పిలుపునిస్తూ సింగరేణి కార్మికులు కూడా దీనిలో పాల్గొనాలని పిలుపునిచ్చాయి. కానీ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావు అని, సింగరేణి యాజమాన్యం తీర్చగలిగినవి కూడా కావు అని. సింగరేణి సంస్థ పరిధిలోని సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించు కునే అవకాశం కలదు అని తెలిపారు.

ఇప్పటికే వివిధ కారణాల వలన ఈ ఆర్థిక సంవత్సరం లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి మరియు ఓవర్ బర్డెన్ తొలగింపు లలో కొంత వెనకబడి ఉన్నామని, ఈ సమయంలో లక్ష్యసాధనకు ప్రతి రోజు సాధించే ఉత్పత్తికూడా ఎంతో తోడ్పాటు నందిస్తుందని అదే విధముగా నిరంతరాయముగా విద్యుత్ సరఫరా జరగడానికి మనం నిర్దేశించిన ఉత్పత్తి సాదిస్తూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు

మనం ఒక్కరోజు సమ్మె చేస్తే సంస్థ నష్ట పోయే ఉత్పత్తి విలువ సుమారు రూ.76 కోట్లు ఉంటుంది అని అలాగే కార్మికులు సుమారు రూ.13.07కోట్ల వేతనాలు కోల్పోతారని తెలిపారు.



గత ఆర్థిక సంవత్సరం 2024–25లో 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 65.27 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరిగినది. లాభాల బోనస్, పిఎల్ఆర్ బోనస్లు ఉద్యోగులకు చెల్లించడం జరుగుతున్నది. వివిధ సంక్షేమ పథకాలను కూడా అమలు చేయడం జరుగుతున్నది.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు (జులై 1 వ తేదీ) మనం 16.26 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాం. ఈ ఆర్థిక సంవత్సర (2025–26) ఉత్పత్తి లక్ష్యమైన 72 మిలియన్ టన్నులకు గాను జులై 1వ తేదీ వరకు 22.4 % మాత్రమే ఉత్పత్తి సాధించాం అని తెలిపారు. కావున జూలై 9వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు దూరంగా ఉండి విధులకు హాజరయి 2025–26 ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని ఈ సంధర్భముగా విజ్ఞప్తి చేశారు.

అనంతరం అన్నీ ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి మరియు రవాణా కొరకు ఎటువంటి ఆటంకం కలుగ చర్యలను తీసుకోవాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డైరక్టర్(పి,పి) కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు తో పాటు జిఎం(పర్సనల్) ఐఆర్ ,పిఎం కవితా నాయుడు, జిఎం(సెక్యూరిటీ) సిహెచ్. లక్ష్మి నారాయణ, అన్నీ ఏరియాల జనరల్ మేనేజర్లు, డిజిఎం (ఐఆర్ వింగ్) లు కే.అజయ్ కుమార్, వైవిఎల్ వరప్రసాద్, బి.రాజగోపాల్, ఎస్ఓ టు జిఎం సెక్యూరిటీ జే. వేణు మాధవ్సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సైన్ పాల్గొన్నారు.

# బీసీల సంక్షేమానికి 11 వేల కోట్లు సరిపోతుందా....

- మూడు లక్షల కోట్ల పైన ఉన్న బడ్జెట్లో బీసీలకు 20వేల కోట్ల బడ్జెట్ కేటాయించలేరా....
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎల్లయ్య..



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 8.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఆలకుంట్ల ఎల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క 2025– 26 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ను శాసనసభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా బీసీల సంక్షేమానికి 11,405 కోట్ల రూపాయలను కేటాయించడం,మూడు లక్షల పైన రాష్ట్ర బడ్జెట్లో 11,405 కోట్ల బడ్జెట్ను 50 శాతం పైన ఉన్న బీసీలకు కేటాయించడం అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఆలకుంట్ల ఎల్లయ్య అన్నారు. కాజీపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రతి సంవత్సరం బడ్జెట్లో బీసీ సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ అగ్ర నాయకులు హామీ ఇచ్చారని,గత సంవత్సర బడ్జెట్లో 9300 కోట్లు కేటాయించగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి 11400 కోట్లు కేటాయించడం బీసీల పట్ల చిన్నచూపుగా చూడవలసి వస్తుందని ఆయన అభివర్ణించారు.మరో తెలుగు రాష్ట్రంలో బీసీలకు 47 వేల 456 కోట్లు కేటాయించారని, బీసీ ఓటుతో గెలిచిన ప్రభుత్వం బీసీలను మరవడం అన్యాయమని ఆయన ఆవేదన వెలబుచ్చారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు బీసీలను అభివృద్ధిలో, సంక్షేమంలో చిన్నచూపు చూస్తున్నారని, ఇప్పటికైనా రాబోయే బడ్జెట్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని 20వేల కోట్లను కేటాయిస్తూ బడ్జెట్లో సవరణ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో యాదాద్రి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పంజా సజావర్ అలీ, నాయకులు పోల్ నాగయ్య, పల్సం రాజు గౌడ్, పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఈ ఓ పై దాడులని ఖండించిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఉద్యోగుల యూనియన్, యాదగిరిగుట్ట.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,**భద్రాచలం పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కు సంబంధించిన పురుషోత్తపట్నం గ్రామంలో గల భూములు పరిరక్షించేందుకు వెళ్లిన ఈవో రమాదేవి మరియు వారి అర్చకులు, సిబ్బందిపై దాడులు చేయడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, అట్టి దాడులను యాదగిరిగుట్ట దేవస్థానం ఆలయ ఉద్యోగుల యూనియన్ తరపున తీవ్రంగా ఖండించారు. భద్రాచలం దేవస్థానమునకు చెందిన దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది మరియు కార్యనిర్వహణాధికారి పై దాడికి కారణమైన వారిని చట్ట పరంగా శిక్షించాలని మరియు ఇట్టి విషయం లో ప్రభుత్వం చొరవ తీసుకుని ఆలయ భూములు కాపాడుకొనుట కోసం ఉద్యోగులకు తోడ్పాటు అందించగలరని కోరారు.

ఈ కార్యక్రమం లో ప్రధాన దేవాలయాల జేఏసీ చైర్మన్ రమేష్ బాబు, ఏఈఓలు, పర్యవేక్షకులు, అర్చకులు, సిబ్బంది, ఇతర మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వికలాంగుల బహిరంగ సభను విజయవంతం చేద్దాం



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**వికలాంగుల బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం ఈరోజు యాదాద్రి భువనగిరి జిల్లా విహెచ్పిఎస్ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది ఈ సమావేశానికి విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు ధరణికోట నరసింహ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టర్ రామచంద్రయ్య గారు ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జి గడ్డం కాసు గారు పాల్గొని వారు మాట్లాడుతూ వికలాంగులకు 416 నుండి పెన్షన్ 6000 వరకు పెంచి మరియు వృద్ధుల వితంతువు ఒంటరి మహిళలు చేనేత గీత కార్మికుల 2016 నుండి 416 రూపాయలు పెంచాలని అదేవిధంగా వికలాంగులకు బస్సు పాసులు ఇవ్వాలి స్థానిక సంస్థలు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాష్ట్ర ఇటుకల దేవేందర్ మాదిగ నాయకులు బర్రె శంకర శంకర్ ఎర్ర వీరయ్య అనంతుల ఎల్లారెడ్డి ఎస్ కె బీర్ జిల్లా నాయకులు కాటపల్లి రజిత కొలనుకొండ లాలయ జగిలపురం ఐలయ్య లోడెడ్ ధనంజయ గౌడ్ మచ్చ ఉపేందర్ సిగం, కర్ణాకర్ మన్నాల మధు తదితరులు పాల్గొన్నారు

# ఆత్మకూరు ఉన్నత పాఠశాల లో వ్యాస రచన పోటీలు

**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**వయోదికులపై వేదింపులు నివారణ సంరక్షణ అనే అంశం పై సీనియర్ సిటిజన్స్ పిలుపు మేరకు ఈ రోజు ఆత్మకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసం రచన పోటి నిర్వహించినారు.ఇందులో విజేతలైన వారికి జిల్లా కేంద్రంలో కలెక్టర్ గారి చేతులమీదుగా బహుమతులు ఇవ్వనున్నారు ఈ కార్యక్రమంలో యం ఇ ఓ కొత్త మహాదేవ రెడ్డి సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు పాఠశాల ఉపాధ్యాయులు మజ్జిగ లక్మణ్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జూలై 9న జరిగే కార్మిక సమ్మెకు ఐదు మద్దతు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ. జూలై 9న జరిగే కార్మిక సమ్మెకు ఐలు మద్దత్తు
కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల కు ఖండించిన ఐలు రాష్ట్ర ఉపాధ్యాక్షులు మామిడి వెంకట్ రెడ్డి జూలై 9న అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశ వ్యాపిత సమ్మెకు అల్ ఇండియా లాయర్ యూనియన్ ఐలు సంపూర్ణ మద్దత్తు ప్రకటించడం జరిగిందని రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి అన్నారు 100 కు పైగా ఉన్న కర్మిక చట్టాలను నాలుగు లేబర్ కొడులుగా చేయడం కర్మిక హక్కులను హరించడమే అని అయన అన్నారు వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసి చట్టాలను యధావిధిగా కొనసాగించాలని వారు కోరారు
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వాణిజ్య సంస్థలలో రోజుకు 10 గంటలకు తగ్గకుండా పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అనుమతిస్తూ జి ఓ ఇవ్వడాన్న వ్యతిరేకించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమం లో జిల్లా గౌరవ అధ్యక్షులు కుక్కదువ సోమయ్య, అధ్యక్షులు బోల్లేపల్లి కుమార్, ఉపాధ్యక్షులు తాడక మోహన్, పాల్వంచ జగత్, ఎండ్ నేహాల్, సహాయ కార్యదర్శుల సీసా శ్రీనివాస్, సుదగాని శ్రీహరి, చింతల రాజశేఖరరెడ్డి, కోశాధికారి బొడ్డు కిషన్, తదితరులు పాల్గొన్నారు

## సార్వత్రిక సమ్మెతో కేంద్రం దిగిరావాలి.

- సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపుతున్నాం.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,** కొత్తగూడెం : కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను తక్కట్టుపెడుతున్న కేంద్రం తీరుకు నిరసనగా బుధవారం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెతో కేంద్రం దిగి రావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక 'శేషగిరి భవన్'లో అయన మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కులపై దాడికి పాల్పడోతోందని, ప్రజాస్వామ్య, రాజ్యంగ హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కేంద్రం తీసుకువస్తున్న సంస్కరణలు, చట్టాలు దోపిడీ వర్గాలకు మేలుచేసే విధంగా ఉన్నాయని, కార్మికులు, ప్రజలకోసం కాకుండా కార్పొరేట్ సంస్థలకోసమే పనిచేస్తున్నదని ఆరోపించారు. పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చేందుకు కేంద్రం కుట్రచేస్తోందని, విమర్శించారు. ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలం చెందడంతో పేద, సామాన్య ప్రజలు రెండుపూటలా తినలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సమ్మె విజయవంతంకోసం జిల్లా వ్యాపితంగా సిపిఐ శ్రేణులు, అనుబంధ కార్మిక, ప్రజాసంఘాలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్న కేంద్రానికి సార్వత్రిక సమ్మె గుణపాఠం కావాలని, సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని, ప్రజలు, వ్యాపారవర్గాలు సమ్మెకు సహకరించాలని సాబీర్ పాషా కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించండి.

- అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.
- ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి.
- పాఠశాలల్లో స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయండి.
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పాఠశాల కేంద్రంగా అమ్మే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి.
- జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాల.
- బి వీరభద్రం, డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,** భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (డిఎస్ఎఫ్ఐ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బి వీరభద్రం, జిల్లా నాయకులు రామ్ చరణ్ డీఈవో తో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీలు ఇవ్వాలని, ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అమ్మితే తగు చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్ళు చేస్తే కఠినంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అనుమతులు లేకుండా నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. విద్యాహక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నితీష్, రాము, దక్షిక్, విశ్వ, జవహార్ తదితరులు డీఈవో ను కలిసి వినతిపత్రం అందజేశారు.

# భద్రాచలంలో బిసిల సమర శంఖారావం..

- హాజరుకానున్న బిసి జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్.
- బీసీ సంఘ,రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఈ మహా శంఖారావాన్ని జయప్రదం చేయండి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 08,** భద్రాచలంలో, శుభం ఫంక్షన్ హాల్ లో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అంకినీడు ప్రసాద్ అధ్యక్షతన, బీసీ సమావేశం జరిగింది. 13 జూలై 2025 ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మరియు, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు రానున్నారు. భద్రాచలంలోని శుభం ఫంక్షన్ హాల్లో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షతన 13 జూలై 2025 నా బిసి సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించుటకు, ఈ సమావేశంలో చర్చించుకుమారు. ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించింది. దాని అమలు కొరకై చట్టబద్ధత కల్పించి ఎన్నికలకు పోవాలని, బిసి సంక్షేమ సంఘం కోరనున్నది. అలా కాకుండా హామీలను విస్మరచించినట్లయితే, బీసీలంతా పోరుబాటకు తరలి వెళ్లడం తప్పని సరని, ప్రభుత్వాన్ని అన్ని బీసీ సంఘాలు హెచ్చరిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ,13. 07.2025 ,నాడు బిసి సంక్షేమ సంఘం సమర శంఖారావం కు, పిలుపునివ్వడం జరుగుతుందని, కావున ఈ బీసీ సంక్షేమ సంఘం సమర శంఖారావం సభకు అన్ని బీసీ సంఘాలు సోదరులు సోదరీమణులు ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ బీసీ సంక్షేమ సమర శంఖారావం సభను జయప్రదం చేయగలరని కోరడమైనది.
ఈ కార్యక్రమానికి హాజరైన, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బుర్ర సోమేశ్వర్ గౌడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, అంకినీడు ప్రసాద్ , జిల్లా బీసీ సంఘంవర్కింగ్ అధ్యక్షులు, కౌడగాని శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి, కూదిక్యల సమ్మయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు, కుదురుపాక మీనా, జాతీయ సలహాదారులు, మిట్టపల్లి సాంబయ్య, మణుగూరు మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, వీరంకి వెంకట్రావు, ఉపాధ్యక్షులు, నాగరపు సతీష్ కుమార్ ప్రజాపతి, మణుగూరు మండల బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, పెనుగొండ సాంబశివరావు, మణుగూరు మండల బిసి సంక్షేమ సంఘం కోశాధికారి, పొదిల వీరబాబు, భద్రాచలం బీసీ ఐక్యవేదిక నుండి అధ్యక్షులు. బొలిశెట్టి రంగారావు, గౌరవ అధ్యక్షులు, టీవీ , గౌరవ అధ్యక్షులు, తాళ్ల రవికుమార్ ,ప్రధాన కార్యదర్శి, బండారు నాగేశ్వరరావు, కోశాధికారి, కొప్పనాతి శాంతారావు, ఉపాధ్యక్షులు, నరసింహ చారి అనుగోజు, సహాయ కార్యదర్శి. మేకల మల్లు బాబు, ఒగ్గ రమణ, ఆకుల సీతారాం గారు, శేషు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## అన్నారుగూడెంలో ఘనంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు..

**తల్లాడ, జులై 8 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్, షేక్. యాకూబ్ పాషా ఆధ్వర్యంలో అన్నారుగూడెంలో ప్రధాన రహదారి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలుత కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సాయిబాబా దేవాలయం పక్కన ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద పేద విద్యార్థుల సమక్షంలో జయంతి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి సత్యవతి దంపతులు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ, 108, 104, రైతు రుణమాఫీ తదితర మహెూత్తరమైన పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది%శ్రీ%న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోగుల రాఘవ, కోసూరు రామారావు, పడాల లక్ష్మణరావు, బయ్యారపు నరసింహారావు, ఇండ్ల



రంగ, తదితరులు పాల్గొన్నారు.

## తెలగవరం గ్రామంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ....



- మంద కృష్ణ మాదిగ ఆదేశానుసారం ఉత్తమ సేవకులకు ఘన సన్మానం ...
- డాక్టర్ వెంకటేశ్వరావును సన్మానించిన ఎమ్మార్పీఎస్ యువకులు ...

**తల్లాడ జూలై 08, సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ ....** తల్లాడ మండలం తెలగవరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం మరియు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు. సోమవారం ఆ గ్రామంలో ఘనంగా నిర్వహించారు..
కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ చీఫ్ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం సమాజానికి వివిధ సందర్భాలలో,పలు రకాలలో సేవలందించిన ఉమ్మడి రాష్ట్రాలలో మన అణగారిని ఆత్మబంధువులను ఎమ్మార్పీస్ ఆవిర్భావం సందర్భంగా సన్మానించుకోవాలన్న అన్న సూచన మేరకు గ్రామంలో దాదాపు 30 సంవత్సరాలకు పైగా సుదీర్ఘంగా వైద్య రంగంలో ఆర్ఎంపీగా విశేష సేవలు అందించి,దండోరా ఉద్యమానికి చేదోడు వాదోడుగా నిలిచినటువంటి జాతి ఆత్మీయుడు,గ్రామ ప్రజలకు సుపరిచితుడు, సౌమ్యుడు డాక్టర్ కిన్నెర వెంకటేశ్వరావును గ్రామ పెద్దలు,ఎమ్మార్పీఎస్ నాయకులు,మహిళలు, యువతీ యువకులు పూలమాలలు అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ యువకులు ఏపూరి రామారావు,మేడి నరేష్,తేల్లూరి నిఖిల్, గణేష్,గొల్లమందల సతీష్, జీవన్,అభి,మహేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియా పై క్షేత్ర ప్రదర్శన

**తల్లాడ, జులై 8 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:** తల్లాడ మండల పరిధిలో అన్నారు గూడెం గ్రామంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తుపల్లి వి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నానో యూరియా పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించినారు దీనిలో భాగంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నానో యూరియా వాడకం వలన మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని మరియు నానో యూరియా వాడకం వల్ల ఖర్చు తక్కువగాను మరియు పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందని రైతులకు వివరించారు. యూరియాతో పోల్చుకుంటే నానో యూరియా పోషక వినియోగ సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని అలాగే అన్ని రకాల సూక్ష్మ పోషకాలు మొక్కకి అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు అన్ని రకాల పంటలకు నానో యూరియా స్ప్రే చేసుకోవచ్చని తెలియజేశారు
పంట విత్తిన నెలరోజుల తరువాత నుండి పంట కాలంలో




20,40 రోజుల తరువాత నానో యూరియా స్ప్రే చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు
ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండి తాజుద్దీన్ ఏఈవో హసీనా ఇఫ్కో డీలర్ గ్రామ రైతులు పాల్గొన్నారు

## కొత్తగూడెం లో జరిగే జాగృతి మహాసభను విజయవంతం చేయండి

- బానోత్ కిషన్ నాయక్ తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులులి



**సి కె న్యూస్ ప్రతినిధి:** జూలై 10 న తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం క్లబ్లో జరిగేటటువంటి జాగృతి మహాసభను విజయవంతం చేయగలరు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి చేస్తూ ఈనెల జూలై 17న జరిగేటటువంటి బీసీల ధర్మ యుద్ధం రైల్ రోకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ జాగృతి ఆకాంక్షలను సబండ వర్గాల కోసం పనిచేస్తున్న కల్వకుంట్ల కవిత కమిట్మెంట్ ను గౌరవిస్తూ మా వర్గాల కోసం సకల జనుల కోసం పరితపిస్తూ మా కోసం పనిచేసేటటువంటి నాయకురాలితోని మేము సైతం ఉంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వివిధ రంగాలు వివిధ సంఘాలకు సంబంధించినటువంటి నాయకులు భారీ ఎత్తున జాగృతి సంస్థలో చేరికలు జరుగుతున్నయని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ఆకాంక్షిస్తున్నామని తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు భానోత్ కిషన్ నాయక్ అన్నారు

## తండాల్లో ఘనంగా సీత్ల పండుగ

- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా వేడుకలు



**సి కే న్యూస్, ఆత్మకూర్ , సూర్యాపేట.** తరతరాలుగా గిరిజనులు ప్రతి సంవత్సరం పెద్దపుషాల కార్తెలో మొదటి మంగళవారం నిర్వహించే సీత్ల (దాటుడు) పండుగను మంగళవారం గిరిజను లు వారి సంప్రదాయాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తమ తండా శివారు సమీపంలో బంజారాల పకృతి దేవతలైన మేరామాయాడీ, తోళ్జా భవాని, మంత్రాళ్, కంకాళియాడి, హీంగ్లా, ధ్యాళాంగర్, సీత్లాయాడీలను ప్రతిష్ఠించారు. ఇంటి వద్ద పూజలు పూర్తి చేసుకున్న మహిళలు, కన్నె పిల్లలు అమ్మవారులకు నైవేద్యంగా సమర్పించేందుకు జొన్న గుగ్గులు, పప్పుధాన్యాలతో తయారు చేసిన ఘుగ్రి (గుగ్గిళ్లు)లు, లాప్సీ(పాయసం), ఏడు ఎండు మిర్చి, ఉల్లిగడ్డ, చింతపండు మరియు రూపాయి బిల్లను కాకోటి(చెక్క పాత్ర) నేటి తాంబులంలో పెట్టి దానిపై పూళ్యాగణోతో కల్పి కన్నెలు పిల్లలు ఆ పళ్లెంను నెత్తిన పెట్టుకోని, సీగేర్ పాణి (బావి నుంచి సేకరించిన నిండుకుండనీటి)తో సేవాలాల్ మహారాజ్, సీత్లాభవానిని కీర్తిస్తూ పాటలు పాడుతూ, దప్పుచప్పులతో యువతి, యువకులు నృత్యాలు చేస్తూ పూజా ప్రదేశానికి చేరుకున్నారు. అందరూ ప్రత్యేకంగా తీసుకొచ్చిన నైవేద్యాన్ని అమ్మవార్లకు సమర్పించి సీనియర్ పాని (నిండుకుండ నీళ్లను) అమ్మవార్ల బంటు అయిన లింకుడియా ముందు పోసి తమ మొక్కలను చెల్లించుకున్నారు. గిరిజనులు తమ పశు సంపద, పంటలు, తాము ఆరోగ్యంగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు. తమ మొక్కుగా అమ్మవార్లకు గొర్రెపోతు, మేకపోతును బలి ఇచ్చి పేగులు బయటికి తీసి లుంకిడియా నుండి సీత్లాభవానికి వరకు పరచి గొర్రెపోతు రక్తం, పొట్ట నుండి తీసిన పెడను మిశ్రమంను కొద్ది దూరంలో ఉన్న పశువులు, మేకలు, గొర్రెలను ఆ పేగుపై నుండి దాటిస్తూ వాటిపై రక్తం, పెడ మిశ్రమాన్ని, అమ్మవారికి బలి ఇచ్చే కోడి పుంజులను పశు వులపై విసిరారు. రేస్తారు. వర్షాలు సకాలంలో పడి, పంటలు సమృద్ధిగా పండి, సమస్త ప్రాణకోటి ఆరోగ్యంతో ఉండాలని అమ్మవార్లను పూజిస్తారు.

# కుషాయిగూడ పిహెచ్ సీ లో బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ మిషన్ ప్రారంభం




**కాప్రా సర్కిల్, సి కే న్యూస్** కుషాయిగూడ పిహెచ్ సి(జమ్మిగడ్డ)లో మంగళవారం బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ మిషన్ ను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసి) వారు పిహెచ్ సీకి స్క్రీనింగ్ మిషన్ ను అందజేసారు. డిప్యూటీ డిఎమ్ అండ్ హెచ్ ఓ శోభ గారు.

మాజీ ఎమ్మెల్యేలు ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ బేతి సుభాష్ రెడ్డి, ఎంబీసీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, పియూష్ మిట్టల్, మంకెనా శ్రీనివాస్ రెడ్డి, మహితా డైరెక్టర్ పి. రమేష్ శేఖర్, రెడ్డి, పిహెచ్ సీ ఇంచార్జీ డాక్టర్ రమాదేవి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నీ కలిసిన చక్రిపురం కాలనీ నూతన కార్యవర్గం



**చర్లపల్లి, సి కే న్యూస్** చర్లపల్లి డివిజన్ చక్రిపురం కాలనీ లో చక్రిపురం సంక్షేమ సంఘం ఎన్నికలలో అధ్యక్షులుగా గడ్డల పాండు ముదిరాజ్ ప్రధాన కార్యదర్శిగా సోమసాని అశోక్ ఎన్నికయ్యారు.మంగళవారం సైనిక్ పూరి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని డ్రైనేజీ సమస్య మరియు రోడ్డు సమస్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కొండారెడ్డి, లాల్ సింగ్, సంయుక్త కార్యదర్శులు బి. భాస్కర్ రెడ్డి, ఎర్రయ్య, కోశాధికారి జగన్మోహన్ రెడ్డి ఉప కోశాధికారి యాకయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎం. చంద్ర రెడ్డి వి. బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, సి కే న్యూస్:**ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని దేవేందర్ నగర్ లో ఉప్పల్ డీసీ ఆంజనేయులుతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు.దేవేందర్ నగర్ కాలనీ లో నెలకొన్న ప్రధాన సమస్య డ్రైనేజీ వ్యవస్థ మరియు స్ట్రీట్ లైట్ అలాగే కమ్యూనిటీ హాల్ నిర్మాణం వాటర్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తా అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తా..

## కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..



**ఎల్బీనగర్, సి కే న్యూస్**కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయపు నడకలో భాగంగా కాలనీవాసులు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆర్టీసీ మజ్దూర్ కాలనీలోని సమస్యలు, కాలనీలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలోని భూగర్భ డ్రైనేజ్, సీసీ రోడ్ల సమస్యలను కార్పొరేటర్ కి వివరించగా, అధికారులతో సమీక్షించి వీలైనంత త్వరగా కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ లో ఘనంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ జన్మదిన వేడుకలు

**పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు కటికి కిరణ్ కుమార్**




**సీ కే న్యూస్ :**స్థానిక తల్లాడ పట్టణం నందు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మహానేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ శ్రీ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి ప్రజలందరికీ స్వీట్లు పంపిణీ చేసారు. అనంతరం తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్లో గల వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్ రెడ్డి ని గుర్తు చేస్తూ వారు మాట్లాడుతూ పేద ప్రజల జీవితాల వెలుగును నింపిన మహనీయుడని వైయస్ రాజశేఖర్ రెడ్డి మార్గం ఎప్పటికీ అనుసరణీయం పేదరిక నిర్మూలనకు మందు విద్య, వైద్య ఆరోగ్యమని సుత్రికరించిన సామాజిక వైద్యుడు మరణం లేని మహనీయుడు రైతు బాంధవుడు సంక్షేమ పథకాల రూపకర్త ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద ప్రజల గుండెల్లో వెలుగులు నింపిన రాజశేఖర్ రెడ్డి యొక్క సేవలను గుర్తు చేసారు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడిగా నిలిచిపోయిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క రాజశేఖర్ రెడ్డి ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హోదాలో రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి మరియు ప్రజలందరికీ చేసిన సేవలను గురించి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి వీర అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చవద్దు..

**రంగారెడ్డి జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి..**

**ఎల్బీనగర్ సి కే న్యూస్:**కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చవద్దని రంగారెడ్డి జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి అన్నారు. సాహెబ్ నగర్ లోని వెంకటేశ్వర కాలనీ, జక్కిడి రామ్ రెడ్డి కాలనీల నుండి ర్యాలీ నిర్వహించారు, ఈనెల 9న జరిగే సమ్మె జయప్రదం చేయాలని, నినదిస్తూ కార్మికులకు 10 గంటల జీవో 282 రద్దు చేయాలని, కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చవద్దని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ వెంటనే నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, ఈ కోడ్ లు కార్మికులకు యూనియన్ పెట్టుకునే హక్కు నీ అరించి వేస్తున్నాయని, కార్మికుల బార్గానిక్ శక్తిని అరించి వేస్తున్నాయని, కావున లేబర్ కోడెలను రద్దుచేసి గతంలో ఉన్న లేబర్ చట్టాలని అమలు చేయాలని కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సాహెబ్నగర్ కలాన్ లో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ ప్రదర్శనలో గీత కార్మిక సంఘం నాయకులు కొత్త గణేష్ గౌడ్, మహిళా సంఘం నాయకురాలు తిరుమల సంధ్య, జంగయ్య గౌడ్, గిరీష్, సంతోష, సరిత, బిక్షపతి, లక్ష్మీనారాయణ సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

వందనములతో కీసరి నర్సిరెడ్డి సిఐటియు ఉపాధ్యక్షులు. రంగారెడ్డి జిల్లా.

# మహిళలకు అండ రాచకొండ షీ టీమ్స్...



● రాచకొండ సిపి జి.సుధీర్ బాబు..

**ఎల్బీనగర్, సి కే న్యూస్:**పదిహేను రోజుల్లో 185 మంది పోకిరీలను పట్టుకున్న రాచకొండ షీ టీమ్స్:

బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు,ఐపిఎస్., గారు తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ.., వారిని,వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారని అన్నారు.

రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు ఈరోజు రాచకొండ క్యాంప్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. రాచకొండ కమిషనరేట్ పరిదిలో మహిళలను, యువతులను వేదింపులకు గురిచేస్తున్న 185 (మేజర్స్-139 ,మైనర్స్-46 ) మందిని షీ టీమ్స్ పట్టుకున్నారు. వారికి ఎల్బీనగర్ సిపి క్యాంప్ కార్యాలయంలో (ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆఫీసు)లో, కౌన్సిలర్స్ తో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గత నెల తేదీ 16 నుండి 30 తేదీ వరకు 215 పిర్యాదులు అందినాయని,

**అందిన ఫిర్యాదులలో..,**

ఫోన్ల ద్వారా వేదించినవి -37, సోషల్ మీడియా ద్వారా వేదించినవి-79 , నేరుగా వేదించినవి - 99. వాటిలో క్రిమినల్ కేసులు-9, పెట్టి కేసులు-105, మరియు 78 మందికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని విమెన్ సేఫ్టీ వింగ్ డి.సి.పి శ్రీమతి టి. ఉషారాణి తెలిపారు.

**ముఖ్యమైన కేసులు కొన్ని...,**

గెట్ టు గేదర్ పార్టీ లో నంబర్ తీసుకొని వివాహిత ను వేధింపులకు గురిచేసిన వ్యక్తి అరెస్టు : షీ టీమ్ కి అందిన పిర్యాదు మేరకు, 10వ తరగతి బ్యాచ్ మేట్స్ అందరూ గెట్-టు-గేదర్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసుకొని కలుసుకున్నారు. గెట్ టు గేదర్ పార్టీ లో ఫోన్ నంబర్స్ తీసుకున్నారు. నిందితుడు అప్పటినుండి క్రమం తప్పకుండా ఆమెకు ఫోన్ చేసి వేదించేవాడు. ఎంత చెప్పిన వినకపోవడంతో ఇట్టి విషయంపై షీ టీం వారిని సంప్రదించగా పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపడమైనది.

**సోషల్ మీడియా ద్వారా వేదిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు:**

షీ టీమ్ కి అందిన పిర్యాదు మేరకు, వారం రోజుల నుండి ఆమె యొక్క ఇన్స్టాగ్రామ్ ఐడి కి గుర్తుతెలియని వ్యక్తి "నేను నీ బావని" నాతో మాట్లాడు అంటూ మెసేజ్లు మరియు ఫోన్ కాల్స్ చేసి తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలంటూ లేదంటే ఆమె ఫోటోలను మార్ఫింగ్ చేసి అందరికీ పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఆమె యొక్క ఫోటోని ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసి దానిపై ఆమె ఫోన్ నెంబర్ టైప్ చేసి ఈమె ను ఎవరైనా బుక్ చేసుకోవచ్చు అని అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నాడు. ఆమె ఫోన్ ఎత్తకపోతే ఎవరితో మాట్లాడుతున్నావు అని అసభ్యకరంగా తిడుతూ స్టోరీ పెడుతున్నాడు. ఇట్టి విషయంపై షీ టీమ్ వారిని సంప్రదించగా పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపడమైనది.

**ప్రేమ, పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు**

షాపింగ్ మాల్ లో పని చేస్తున్న ఒక యువతికి అదే షాపింగ్ మాల్ పనిచేస్తున్న ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడినది. ఆ వ్యక్తి ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మకం కలిగించాడు. అతని కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడించి ఆమెతో పెళ్లికి ఒప్పుకున్నారని ఆమెను నమ్మించాడు. పలుమార్లు ఆమెను శారీరకంగా అనుభవించాడు. కొన్ని రోజుల తర్వాత పెళ్లి చేసుకోమని యువతి అడిగితే, పెళ్లికి నిరాకరిస్తూ, ఈ విషయం ఎవరికైనా చెప్తే ఆమె వ్యక్తిగత ఫోటోలను అందరికీ పంపించి ఆమె పరువు తీస్తానని బెదిరించాడు. ఇట్టి విషయమై సదరు యువతి షీ టీమ్ ని సంప్రదించగ నిందితుణ్ణి ని అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగినది.

**బస్ స్టాండ్ లో న్యూసెన్స్ పోకిరీలు అరెస్టు:**

ఇబ్రహీంపట్నం బస్ స్టాండ్ వద్ద న్యూసెన్స్ చేస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే స్పందించిన షీ టీమ్ ఇబ్రహీంపట్నం అక్కడికి చేరుకొని న్యూసెన్స్ చేస్తున్నా యువకుడిని అదుపులోకి తీసుకొని అతని పై ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగింది.

**అవగాహన కార్యక్రమాలు**

గత నెల తేదీ 16 నుండి 30 తేదీ వరకు షీ టీమ్స్ రాచకొండ మొత్తం 82 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 20480 మందికి మహిళా చట్టాలు, వారి యొక్క హక్కులు, నేరాలు జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించడం జరిగింది.

**మెట్రో-రైల్ డెకాయ్ఆపరేషన్స్:**

రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి, మహిళా కంపార్ట్మెంట్‌లోకి వెళ్ళి ప్రయాణిస్తున్న (5 ) మంది పురుషులను పట్టుకుని మెట్రో స్టేషన్ అదికారుల ద్వారా ఫైన్ వేయించడం జరిగింది.

మహిళలు వేదింపులకు గురి అయినప్పుడు వెంటనే షీ టీమ్ ని, రాచకొండ వాట్సప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ఆ ప్రాంత షీ టీమ్ అధికారుల నంబర్లు భువనగిరి - 8712662598, చౌటుప్పల్ 8712662599, ఇబ్రహీంపట్నం - 8712662600, కుషాయిగూడ -8712662601, ఎల్బీనగర్ -8712662602, మహేశ్వరం - 8712665299, మల్కాజ్గిరి -8712662603, వనస్థలిపురం -8712662604, యాదాద్రి - 8712665300 లకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. విమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి టి. ఉషా రాణి, ఇన్స్పెక్టర్లు ఎం.ముని, జె.హనుమంతు, జి. అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

## గుండె ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తే.. తీరని నష్టం తప్పదు

మై హార్ట్ ఈజ్ బీటింగ్.. అదోలా..ఈ పాట గుర్తుందా.. ఇది ప్రేమలో ఉన్న యూత్?కి కనెక్ట్? అయ్యేలా రాశారు. అందరూ అలానే ఆస్వాదించారు కూడా. అయితే కొన్ని సందర్భాల్లోఈ లిరిక్?ని వాడితే.. 'ఏమయిందో కాస్తచూపించుకోరా..' అంటూ ఫ్రెండ్స్ తమాషా పట్టిస్తుంటారు. అయితే అదే ఇప్పుడు నిజమవుతుంది అంటే నమ్ముతారా? యంగ్?ఏజ్?లో ఉన్నా.. హెల్త్ విషయంలో ఏదైనా అనుమానించదగ్గ సమస్య అనిపిస్తే.. కచ్చితంగా చెకప్ చేయించుకోవాల్సిందే'అంటున్నారు ఎక్స్‌పర్ట్స్.

మొన్నటికి మొన్న జూన్ 28న.. ప్రముఖ నటి, మోడల్, బిగ్?బాస్ ఫేం షెఫాలీ జరివాలా 42 ఏండ్ల వయసులో గుండెపోటుతో మరణించింది. ఈ సంఘటనకు ముందు.. వ్యాపార వేత్త సంజయ్ కపూర్ జూన్ 13న, 53 ఏండ్ల వయసులో గుండెపోటుకు గురయ్యారు. అలాగే గతంలో 46 ఏండ్లలో పునీత్ రాజ్ కపూర్, 40 ఏండ్లకు సిద్ధార్థ్? శుక్లా, 35 ఏండ్ల వయసులో చిరంజీవి సర్జా.. ఇలా ఎంతోమంది ఫేమస్ సెలబ్రెటీలు గుండె పోటు వల్ల మరణించారు. ఈ వార్తలు చదవడానికి, వినడానికి, చూడడానికి భయాందోళనలు కలిగిస్తున్నప్పటికీ.. ఇవి వాస్తవాలు. అయితే వీళ్లు సెలబ్రెటీలు కాబట్టి వాళ్ల గురించి ఎక్కువగా మాట్లాడుకుంటున్నాం. ఇంత చిన్న వయసులో ఎందుకిలా జరిగింది? అంటూ ఆరా తీస్తున్నాం. కానీ సామాన్యుల్లోనూ క్రికెట్ ఆడుతూ ఒకరు, జిమ్ చేస్తూ మరొకరు, రన్నింగ్ చేస్తూ.. ఇలా సడెన్?గా చనిపోయిన వార్తలు కూడా చూశాం. ఇన్ని తెలిసినా అదొక వార్తగా చదివి పక్కన పెట్టడం కరెక్ట్ కాదు. సమస్య చిన్నదైనా ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదు.కర్నాటకలో ఈ మధ్య కాలంలో గుండె పోటు కేసులు వెంటవెంటనే నమోదయ్యాయి. అలా సడెన్? డెత్ అయినవాళ్లలో చాలామంది యంగ్ ఏజ్ వాళ్లు ఉండడం ఆందోళనకరంగా మారింది. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసుల గురించి లోతుగా స్టడీ చేయాలని ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. అయితే అసలు గుండె సమస్యల గురించి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్? అమరేశ్? రావు మాటల్లో..

గుప్పెడు గుండె.. మన శరీరమంతా సజావుగా రక్త ప్రసరణ చేస్తుంది. అలాంటి గుండె ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తే.. తీరని నష్టం తప్పదు. రీసెంట్?గా 20 %-% 40 ఏజ్ గ్రూప్?లో ఎక్కువగా హార్ట్ ఎటాక్? కేసులు వస్తున్నట్టు తెలుస్తోంది. పక్క రాష్ట్రంలో ఇది కొవిడ్ వ్యాక్సిన్ వల్లేనని ప్రచారం జరుగుతోంది. కానీ.. అందులో నిజం లేదని తేలింది. అయితే ముఖ్యంగా ఇప్పుడు వస్తున్న కేసులు చూస్తే లైఫ్ స్టయిల్? మీద ఆధారపడి ఉన్నాయి. కొవిడ్ తర్వాత లైఫ్ స్టయిల్?లో చాలా మార్పులు వచ్చాయి. వాటిలో పాజిటివ్?గా చెప్పుకోవాల్సింది చాలామంది హెల్త్ మీద ఫోకస్ చేస్తున్నారు. మరి నెగెటివ్? ఏంటి అంటే.. కొవిడ్ తర్వాత చాలామంది స్మోకింగ్, డ్రింకింగ్, డ్రగ్స్ వంటి దురలవాట్లకు బానిసలయ్యారు. అలాగే బయటి ఫుడ్?, ప్రాసెస్డ్? ఫుడ్? ఆర్డర్ పెట్టుకుని తినడానికి అలవాటు పడిపోయారు. ఎక్సర్?సైజ్ చేయనివాళ్లు ఎక్కువ శాతం వీటికి అలవాటు పడినట్లు తెలుస్తోంది.

### మత్తు వదలకపోతే..

మరీ ముఖ్యంగా కొవిడ్ తర్వాత చాలామంది కొకైన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. అందులో కొంతమంది 'జిమ్?కి వెళ్తున్నాం.. ఎక్సర్?సైజ్ చేస్తున్నాం.. డైట్ పాటిస్తున్నాం.. మాకేం కాదు..' అనుకుంటున్నారు. కానీ, మార్నింగ్ జిమ్ చేసి నైట్ కొకైన్ తీసుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. మత్తు పదార్థాలు కచ్చితంగా హార్ట్ ఎటాక్‌కు గురయ్యేలా చేస్తాయి. కాబట్టి వాటికి దూరంగా ఉంటేనే మంచిది.

అన్ని హెల్దీ హ్యాబిట్స్ ఉన్నా.. ఒక్క డ్రగ్స్ అలవాటు మానుకోకపోతే మాత్రం సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు నూటికి నూరు శాతం ఆస్కారం ఉంది అని పలు స్టడీల్లో, కేసుల్లోనూ తేలింది. అలాగే జిమ్‌కి వెళ్లి అన్‌హెల్దీ డైట్ పాటిస్తున్నా.. యంగ్‌గా కనపడడానికి డాక్టర్ సూచించని మందులు వాడడం వల్ల కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కొవిడ్‌కుముందే..

కొవిడ్‌కు ముందే నిమ్స్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్‌తో కలిసి హార్ట్ ఎటాక్‌లపై రీసెర్చ్ చేశాం. దాంట్లో తేలింది ఏంటంటే.. 40 ఏండ్ల లోపు ఉన్న పేషెంట్స్ అందులో ఆల్రెడీ స్టంట్ వేయించుకున్నవాళ్లు, హార్ట్‌లో హోల్ ఉన్నవాళ్లను స్టడీ చేశాం. ఇండియాలో ఈ పర్టిక్యులర్ ఏజ్ గ్రూప్‌లోనే హార్ట్ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. ఆ స్టడీలో చాలా తక్కువ మందికి డయాబెటిస్, ఒబెసిటీ, స్మోకింగ్, బీపీ చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి. జన్యుపరంగా లేదా వంశపారంపర్యంగా ఎక్కువ వచ్చేందుకు అవకాశం ఉన్నట్టు తెలిసింది. కానీ పూర్తిస్థాయిలో ఇంకా స్పష్టత లేదు.

అయితే ఒక అమెరికన్ కార్డియాలజిస్ట్.. కూడా దీనిపై రీసెర్చ్ చేయాలని మొదట ఇండియన్ ఆరిజిన్ డాక్టర్స్?ని స్టడీ చేశారు. ఆ రీసెర్చ్?లో విదేశీయుల?తో పోలిస్తే.. ఇండియన్స్?లో సాధారణంగానే రక్తనాళాలు సన్నగా ఉంటాయని, అందువల్ల మనవాళు ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నట్టు ఆయన తేల్చారు. వాస్తవంగా మన దేశంలో గుండె సంబంధిత వ్యాధులు, డయాబెటిస్ వంటివి ఎక్కువ. జన్యుపరంగా వచ్చేవి కూడా ఉంటాయి. కాబట్టి ఇవి గుండె సమస్యలకు దారి తీసేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

### నిర్లక్ష్యం ఖరీదు..

యంగ్ ఏజ్‌లో ఏ ప్రాబ్లమ్ వచ్చినా బాడీ దాన్ని అధిగమించగలుగుతుంది. ఏమాత్రం హెల్త్ ఇష్యూస్ ఉన్నా.. నిర్లక్ష్యం చేయకూడదు. చిన్నప్పుడు ఫిట్స్ వచ్చింది.. ఆ తర్వాత రాలేదు కదా అని కొందరు. ఆస్తమా పెద్దయ్యాక లేదు కదా అని మరికొందరు. తినకపోవడం వల్ల కళ్లు తిరిగాయి.. తింటే సెట్ అవుతుందని, అప్పుడప్పుడు వచ్చే తలనొప్పే పెద్దగా పట్టించుకో నక్కర్లేదని అనుకుంటారు. అలాగే, ఎక్కువగా ఆయాస పడడం, ఇంతకుముందు చేసిన పని ఇప్పుడు చేయలేకపోవడం, అనూహ్యంగా బరువు పెరగడం లేదా తగ్గడం వంటి కొన్ని సమస్యలను చిన్నవే అనుకుని పెద్దగా పట్టించుకోరు.

ఆ తర్వాత మళ్లీ ఏదైనా ప్రాబ్లమ్ వస్తుందా? లేక అది దీర్ఘకాలిక సమస్యకు సంకేతమా? అని ఆలోచించలే కపో తున్నారు. 'సమస్య చిన్నదే కదా' అని నిర్లక్ష్యం చేయకూడదు. అలాంటి వాటిని నిర్లక్ష్యం చేస్తే.. మున్ముందు దేనికైనా దారితీయొచ్చు. కాబట్టి బేసిక్ చెకప్?లు చేయించుకోవడం తప్పనిసరి. హార్ట్, బ్రెయిన్?కి సంబంధించిన సమస్యలను వెంటనే టెస్ట్ చేయించుకోవాలి. అప్పుడే ఎలాంటి ఇబ్బందులు లేకుండా లైఫ్? హ్యాపీగా లీడ్ చేయొచ్చు.

### సడెన్ డెత్‌లకు కారణం

ప్రతి సడెన్ డెత్.. కార్డియాక్ డెత్ కాదు.. గుండెలో కొలెస్ట్రాల్ బ్లాకేజీ ఉండడం వల్ల కావొచ్చు. కొన్ని గుర్తించలేని వ్యాధులు లేదా అనారోగ్య సమస్యల వల్ల కూడా ఇలా జరగొచ్చు. కొన్ని పరిస్థితుల్లో రక్తనాళాలు చీలిపోవడం, గుండెలో రంధ్రం ఉన్నా గుర్తించకపోవడం, గుండె జబ్బు ముదిరిపోవడం వంటి కండిషన్స్?లో సడెన్ డెత్ అయ్యే ప్రమాదం ఉంటుంది.

### బేసిక్ టెస్ట్ అవసరం

ఈ మధ్య ప్రభుత్వం చొరవతో స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ వంటివి చేస్తున్నారు. ఉద్యోగాల్లో చేరే ముందు ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం తప్పకుండా టెస్ట్?లు చేయించుకోవాలి. ఇప్పుడు నిజాం ఇనిస్టిట్యూట్?లో కూడా స్టూడెంట్స్?ని జాయిన్ ?చేసుకునే ముందు వాళ్లకు స్క్రీనింగ్ జరుగుతుంది. తద్వారా ఏదైనా అనారోగ్య సమస్య ఉన్నట్లయితే వెంటనే దాన్ని పరిష్కరించొచ్చు. అయితే చాలామంది ఏంటంటే.. టెస్ట్? చేస్తే ఏదో ఒక సమస్య ఉందని చెప్తారు అని భయపడిపోతుంటారు. అలాకాకుండా బేసిక్ ఫిట్?నెస్ టెస్ట్ చేయించుకోవడం వల్ల చాలా వరకు వ్యాధులను పసిగట్టొచ్చు.

### ఆరోగ్యంగా ఉండడమంటే..

'ఎక్సర్‌సైజ్, డైట్ చేస్తే చాలు.. ఆరోగ్యంగా ఉంటాం' అనుకుంటే పొరపాటు. అవి రెండే సరిపోవు.. మరికొన్ని అంశాలు కూడా బాగుండాలి. అవేంటంటే.. ఒత్తిడి లేకుండా ఉండాలి. మనశ్శాంతి, సంతోషం, సంతృప్తి, లైఫ్ వ్యాల్యూస్ తెలుసుకోవడం, ఫ్యామిలీ, ఫ్రెండ్స్ సపోర్ట్ వంటివన్నీ ఉంటేనే ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండగలడు. – డాక్టర్ అమరేశ్ రావు మాలెంపాటిప్రొఫెసర్ అండ్ హెడ్? డిపార్ట్?మెంట్ ఆఫ్? కార్డియో థొరాసిక్ సర్జరీ, నిమ్స్, హైదరాబాద్?

# కంటి చూపును కాపాడే ఆహారాలు ఇవి..!

## చేపలు, కోడిగుడ్లు మంచివి

## క్యారెట్లు, పాలకూర, బాదం గింజలు తీసుకోవచ్చు

## వీటిల్లో కంటిని కాపాడే ఇంగ్రెడియంట్లు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. మన శరీరంలో కళ్లకు ప్రాధాన్యం ఎంతో ఉంటుంది. కావాల్సిన పోషకాలు అందేలా చూసుకుంటే చాలు.. కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. అలాగే, కంటి నరాలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. మధుమేహం, బీపీ ఉన్న వారు వాటిని నియంత్రణలో పెట్టుకుని, పోషకాహారం అందించడం ద్వారా కంటిచూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. పోషకాలంటే విటమిన్ ఏ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అందించాలి.

కంటి చూపు ఎందుకు తగ్గుతుంది? అనే దానికి వయసు పెరగడం ఒక కారణం. ఫోన్లు, కంప్యూటర్ల స్క్రీన్లను గంటల తరబడి చూస్తుంటే కంటికి విశ్రాంతి తగ్గి, నష్టం జరుగుతుంది. ఇవి కాకుండా ఒత్తిడి, పోషకాల లేమితోనూ కంటి చూపు మసకబారుతుంది.



### చేపలు

కంటికి చేపలు ఎంతో మంచి చేస్తాయి. చేపల్లోనూ సాల్మన్ రకం మంచివి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు. కనుక ఇవి చెడు కొవ్వులను తగ్గిస్తాయి. కళ్లు పొడిబారిపోకుండా, రెటీనాకు మేలు చేస్తాయి.

### బాదం గింజలు

ఆల్మండ్స్ లో విటమిన్ ఈ తగినంత ఉంటుంది. ఇది కంటికి రక్షణనిస్తుంది. వయసు మీరడం వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ నుంచి కాపాడుతుంది. అయితే, రోజులో బాదం గింజలను ఎక్కువ కాకుండా తీసుకోవాలి. అంటే ఒకేసారి మితిమీరి తినకూడదు.

### గుడ్లు

కోడి గుడ్లలో విటమన్ ఏ, లూటిన్, జియాక్సాంతిన్, జింక్ ఉంటాయి. విటమిన్ ఏ కంటి కార్నియాకు ఎంతో అవసరం. కంటిలో కనిపించే ఉపరితలాన్ని కార్నియాగా పేర్కొంటారు. లూటిన్, జియాక్సాంతిన్ కంటికి సమస్యలు రాకుండా రక్షణనిస్తాయి. రెటీనా ఆరోగ్యానికి జింక్ సాయపడుతుంది.

లూటిన్, జియాక్సాంతిన్ ను మన శరీరం తయారు చేసుకోలేదు. పాలకూరలోనూ ఇవి లభిస్తాయి.

### క్యారెట్లు

క్యారెట్లలోనూ విటమిన్ ఏ పుష్కలంగా లభిస్తుంది. పైన చెప్పుకున్న ప్రయోజనాలకు అదనంగా, ఇన్ఫెక్షన్ల నుంచి కూడా విటమిన్ ఏ రక్షణనిస్తుంది.

నానబెట్టిన బాదం గింజలను రోజూ ఉదయం తినాలి
పొద్దున్నే నిమ్మరసం కలిపిన నీరు తాగాలి
స్ట్రెచింగ్ వ్యాయామాలతో నూ మంచి ఫలితాలు



# ఇలా చేస్తే.. జీర్ణక్రియకు తిరుగుండదు!

నేడు మారిన జీవనశైలి వల్ల ఎంతో మంది జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మన జీర్ణ వ్యవస్థ శరీరానికి కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సంగ్రహిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది. నోటి నుంచి పేగుల వరకు ఈ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలతో తిన్నది వంటికి కూడా పట్టదు. బరువు తగ్గుతారు. ఈ సమస్యల నుంచి బయట పడేందుకు, జీర్ణశక్తిని పెంచుకునే ఉపాయాలు ఉన్నాయి.

### బాదం గింజలు

బాదం గింజల్లో మంచి పోషకాలు ఉంటాయని తెలిసిందే. విటమిన్ ఈ, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ప్రొటీన్, ముఖ్యమైన కెమికల్స్, ఫ్లావనాయిడ్, మినరల్స్ ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ కు కారణమవుతుంది. చెడు కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది. దీంతో గుండె కు కూడా రక్షణ ఏర్పడుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఫలితాల ప్రకారం.. ప్రతి రోజూ బాదం తినడం వల్ల బ్యుటిరేట్ సింథసిస్ ప్రక్రియ మెరుగుపడుతుందని తెలిసింది. ఇది షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్. దీనివల్ల పేగుల ఆరోగ్యం బలపడుతుంది. పైగా బాదంలో ఉండే ఫైబర్ కూడా జీర్ణవ్యవస్థకు మంచి చేస్తుంది.

### నిమ్మరసం కలిపిన నీరు

మనలో ఎక్కువ మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ దీనికి బదులు నిమ్మరసం కలిపిన నీరు తాగి చూడండి. ఇది జీర్ణ వ్యవస్థకు ప్రేరణనిస్తుంది. కడుపుబ్బరం, కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే నిమ్మరసం కడుపులోకి వెళ్లిన తర్వాత అక్కడి నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తుంది. నిమ్మలో ఉండే అసిడిటీ జీర్ణ రసాలను ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో తీసుకున్న ఆహారం కూడా చక్కగా జీర్ణమవుతుంది.

### వ్యాయామం

ఉదయం వేళ వ్యాయామం మరో ముఖ్యమైన అంశం. స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. యోగా చేసుకోవచ్చు. రక్త ప్రసరణ పెరిగేలా వేగంగా నడవడం, ఏరోబిక్ వ్యాయామాలు, లేదంటే కాళ్లూ, చేతులను కదిలించేవి అయినా చేసుకోవచ్చు. దీనివల్ల కూడా జీర్ణశక్తి బలపడుతుంది. ముక్కు ద్వారా దీర్ఘ శ్వాస తీసుకుని నోటి ద్వారా విడుదల చేసేదీ అనుసరించొచ్చు.

# నటి పిల్లల్ని ట్రోల్ చేస్తే కార్‌తో గుద్దించేస్తుందట





తమన్నా భాటియా స్పార్కిల్ మోడ్ ఆన్‌లో ఉంది

సోషల్ మీడియా యుగంలో ట్రోలింగ్ సర్వ సాధారణంగా మారింది. ప్రతి చిన్న అంశంపైనా చర్చలు, కామెంట్లు తీవ్రంగా మారాయి. ఇటీవల స్టార్ కిడ్స్ పై ఘోరమైన ట్రోలింగ్ సాగుతోంది. ముఖ్యంగా బాలీవుడ్ లో నటవారసుల అందచందాలు, విలాసాలు, లెగసీ వైఫల్యాలపై టార్గెట్ చేస్తూ కామెంట్లు వినిపిస్తున్నాయి.అయితే తన పిల్లలను ఎవరైనా కించపరుస్తూ కామెంట్ చేస్తే సీనియర్ నటి కాజోల్ అయితే ఏం చేస్తుందో తెలుసా? ఇదే ప్రశ్న కాజోల్ ని ప్రశ్నించింది మీడియా.. దీనికి స్పందించిన ఈ మేటి కథానాయిక.. - నా కార్ ఎదుటకు రావొద్దని చెబుతాను.. ఎందుకంటే మీదికి ఎక్కించి తొక్కించేస్తాను! - అని సరదాగా వార్నింగ్ ఇచ్చారు.కాజోల్ ప్రస్తుతం - మా - సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. ఈ హారర్ థ్రిల్లర్ లో తన కుమార్తెను కాపాడుకునే తల్లి పాత్రలో కాజోల్ అద్భుతంగా నటించారని ప్రశంసలు కురుస్తున్నాయి. నిజ జీవితంలోను తన పిల్లల జోలికి వస్తే కాజోల్ ఎలా ప్రవర్తిస్తారు? అనేది ప్రశ్న. ఒకప్పుడు అస్సలు సహించే స్థితిలో లేనని కాజోల్ తెలిపారు. - పిల్లలను కాపాడుకునే తల్లిగా, ఒకప్పుడు చాలా సీరియస్ గా ఉండేదానిని... ఇప్పుడు కొంత కూల్ గా ఉన్నాన - ని కూడా కాజోల్ అన్నారు.సోషల్ మీడియాలు,

ట్రోలింగ్ జీవితాల్లో చిన్న భాగం. దానికి బదులుగా సానుకూల అంశాలపై దృష్టి పెట్టాలని తన పిల్లలకు సలహా ఇచ్చినట్లు కాజోల్ తెలిపారు. సోషల్ మీడియాల్లో అలా మాట్లాడేవారు ఒక శాతం లేదా 0.1 శాతం మాత్రమే ఉం టారు. ఆ వ్యాఖ్యల్లో నిజమెంతో ఎవరికీ తెలీదు. అలాంటి వా టిపై కాదు.. మీరు మంచిపై దృష్టి పెట్టాలి! అని కాజోల్ అన్నారు.



మీనాక్షి చౌదరి చీర గ్లో ఈజ్ జస్ట్ వావ్

# ఫోటో స్టోరి: బికినీలో పాలక్ చిల్లింగ్ మోడ్



బుల్లితెర నటి శ్వేతా తివారీ కుమార్తె పాలక్ తివారీ పరిచయం అవసరం లేదు. ఈ భామ నిరంతర ఫోటోషూట్లు యువతరంలో వేడెక్కిస్తున్నాయి. పాలక్ ప్రస్తుతం ఆదిపురుష్ నటుడు సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ చేస్తోందంటూ ప్రచారం సాగుతోంది. పాలక్- ఇబ్రహీం జంట ఔటింగులు జంట షికార్లకు సంబంధించిన పోటోలు వీడియోలు గతంలో వైరల్ అయ్యాయి. ఇదిలా ఉంటే, పాలక్ తివారీ ప్రస్తుతం తన మామ్ శ్వేతా తివారీతో కలిసి విహారయాత్రను ఆస్వాధిస్తోంది. ఈ విహార యాత్రలో తల్లీకూతుళ్ల బికినీ లుక్స్ ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.

అందమైన మామ్- డాటర్ జోడీ బికినీలలో ఫోటోలను షేర్ చేసిన తర్వాత నెటిజనులు పిచ్చెక్కిపోతున్నారు. ఈ ఫోటోలలో శ్వేతా తివారీ బ్లాక్ అండ్ వైట్ పోల్కా డాట్ బికినీలో కనిపించగా, పాలక్ తివారీ రెడ్ అండ్ వైట్ బికినీలో కనిపించారు. ప్రస్తుతం ఇవి వైరల్ గా షేర్ అవుతున్నాయి.అందాల మామ్ అండ్ డాటర్ బోల్డ్ లుక్స్ అభిమానులను ఆశ్చర్యపరిచాయి. నెటిజనులు వీటిపై రకరకాల కామెంట్లు చేస్తున్నారు. ఈ ఫోటోలను షేర్ చేసిన పాలక్ తన పోస్ట్‌లోని వ్యాఖ్యల విభాగాన్ని నిలిపివేసింది. కాబట్టి యూత్ ప్రస్తుతం పాలక్ తల్లి శ్వేతా తివారీ వ్యాఖ్యల

విభాగంలో మామ్ అందచందాలపై వ్యాఖ్యానిస్తున్నారు.సల్మాన్ - కిసీ కా భాయ్ కిసీ కి జాన్ - చిత్రంతో తెరంగేట్రం చేసిన పాలక్ తివారీ కెరీర్ పరంగా ఆశించిన దూకుడును చూపించలేదు.

దాదాపు రెండేళ్ల తర్వాత పాలక్ నటించిన హారర్ కామెడీ - ది భూత్నీ - విడుదలైంది. తదుపరి స్టార్ కిడ్స్ సరసన నటించేందుకు అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వరస చిత్రాలతో కెరీర్ పరంగా బిజీగా ఉన్న పాలక్ టాలీవుడ్ అగ్ర నిర్మాతలకు ఫీలర్స్ వదులుతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి.